బలభద్రపురంలో మొక్కుబడి సర్వే

- స్క్రీనింగ్ పరీక్షలు లేకుండానే వైద్య, ఆరోగ్య శాఖ రిపోర్టు
- గడిచిన రెండేళ్లలో 65 మందికిపైగా కేన్సర్

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 231 | విజయవాడ, సోమవారం 24 మార్చి 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 24 March 2025 | Rs



ఉప్పల్‌లో పరుగుల వరద

- అజేయ సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్

6

ఉపాధిలో భారీ కోత!

మోడీ సర్కారు బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం

- 2.54 లక్షలు తగ్గిన 100 రోజులు పనిచేసిన కుటుంబాల సంఖ్య
- దళితుల్లో 41శాతం తగ్గుదల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులను ప్రతి సంవత్సరం తగ్గిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తుండగా, పెద్ద సంఖ్యలో లబ్దిదారులకు 100 రోజులు పనికల్పించకుండా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడీ అదే బాటలో నడుస్తోంది. రాష్ట్రంలో ఉపాధి పనుల్లో భారీ కొత పడుతోంది. దరఖాస్తు చేసుకున్న వారికందరికీ వంద రోజుల పాటు పనిచూపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. వంద రోజులు పనిచేసిన వారి సంఖ్య గత ఏడాదితో పోలిస్తే భారీగా తగ్గింది. దళితుల్లో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉంది.తాజా గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పనిని 4,32,834 కుటుంబాలకు మాత్రమే కల్పించారు. గత ఏడాది వంద రోజులు పనులు చేసిన వారి సంఖ్య 6,87,396గా నమోదైంది. దానితో పోలిస్తే వందరోజుల పనులు చేసిన కుటుంబాల సంఖ్య 38 శాతం (2,54,562) తగ్గింది. ఇంత భారీ సంఖ్యలో తగ్గుదల నమోదుకావడం అధికారవర్గాల్లో సైతం చర్చనీయాంశంగా మారింది.

పెరిగిన నమోదులు..

వందరోజులు పనులు చేసిన కుటుంబాల సంఖ్య తగ్గిందంటే ఆ పనులకు డిమాండ్ తగ్గిందని అర్థం కాదు. నిజానికి పనుల కొరత తీవ్రంగా ఉండటంతో గత ఏడాది కంటే ఈ ఏడాది అధికారిక సమాచారం ప్రకారమే 3.33 లక్షల కుటుంబాలు అదనంగా ఉపాధి పనుల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నాయి. 2023-24లో 67.98 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు పొందగా, 1.21 కోట్ల మంది వేతనదారులు ఉన్నారు. 2024-25లో 70 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు పొందగా, ఈ కుటుంబాల్లో 1.22 కోట్ల మంది వేతనదారులు ఉన్నారు. జాబ్‌కార్డుల పొందిన కుటుంబాలు కానీ, పనుల కోసం ఎదురుచూసే వేతనదారులు గాని గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాదే ఎక్కువ! వారందరికీ పూర్తిస్థాయిలో పనులు మాత్రం లభించలేదు.

దళితులపై తీవ్ర ప్రభావం

ఇదే సమయంలో ఈ పనులపై ఆధారపడిన దళితుల్లో వంద రోజులు పనులు పూర్తి చేసిన కుటుంబాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 41శాతం తగ్గింది. గతఏడాది 1,37,511 కుటుంబాలు వంద రోజులు ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తే ఈ ఏడాది వీటి సంఖ్య 81,761 మాత్రమే! గిరిజనుల్లో కూడా 6శాతం తగ్గుదల నమోదైంది. ఇక జిల్లాల వారీగా ఈ కుటుంబాల సంఖ్యను పరిశీలిస్తే అల్లూరి సీతారామరాజు జిల్లా 63,029 కుటుంబాలతో తొలి స్థానంలో ఉండగా తరువాతి స్థానంలో శ్రీకాకుళం జిల్లా 42,571 కుటుంబాలతో నిలిచింది. 1,328 కుటుంబాలతో గుంటూరు జిల్లా చివరి స్థానంలో నిలిచింది.

ఫిర్యాదులూ ఎక్కువే!

రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టం అమలుపై ఫిర్యాదులు కూడా ఎక్కువగానే వస్తున్నాయి. అనేక చోట్ల యంత్రాలు వినియోగం జరుగుతోది. నకిలీ మస్తర్లతో పనులు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిపైన అనేక చోట్ల ఆందోళనలు కూడా జరుగుతున్నాయి. అయినా ప్రభుత్వంలో స్పందన కనిపించడం లేదు. ప్రభుత్వం నిర్వహించిన అధ్యయనం ప్రకారం గిరిజనుల్లో 40శాతం మందికి జాబ్‌కార్డులు లేవని తేలింది. 13 శాతం మందికి బ్యాంకు ఖాతాలు లేవు. ఉపాధి హామీ చట్టం ప్రారంభమైన కొత్తంలో ఆ పథకాన్ని ఆ పథకాన్ని అత్యంత సమర్ధవంతంగా అమలు చేసిన రాష్ట్రాల జాబితాల్లో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం లభించేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోవడం పట్ల పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న 'చరిత్ర'

- హెచ్‌ఇసికి దక్కని ఆదరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యలో 'చరిత్ర' సబ్జెక్టు కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. అందరూ సైన్స్ సబ్జెక్టులపై ఆసక్తి చూపడం, ఈ సబ్జెక్టు కూడా కేవలం ప్రభుత్వ కళాశాలలకే పరిమితం కావడంతో వీటిల్లో చేరేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. మరోపక్క ప్రభుత్వం కూడా హెచ్‌ఇసిపై దృష్టి సారించడం లేదు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నిర్వహించే సివిల్స్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించే గ్రూప్-1, 2 వంటి ప్రధాన పోటీ పరీక్షలతో పాటు ఎస్ఎస్‌సి, పోలీస్ పోస్టులు రాయాలంటే చరిత్రకు ప్రాధాన్యత ఉంటుంది. చరిత్ర సబ్జెక్టు లేకుండా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చాలా కష్ట పడాల్సి ఉంటుందని విద్యావేత్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. మరోపక్క కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ ఇచ్చే విద్యాసంస్థలు రూ.లక్షల్లో ఫీజులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్‌లో చరిత్ర ఉన్న హెచ్‌ఇసి గ్రూపునకు ప్రభుత్వం కూడా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ప్రతి కళాశాలలో హెచ్‌ఇసి కోర్సు ఉండాలనే నిబంధన ఉంది. కానీ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం ప్రభుత్వ కళాశాలల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది. రాష్ట్రంలో 475 ప్రభుత్వ, 2,183 ప్రైవేట్, 1,106 ఇతర జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 350 ప్రభుత్వ కళాశాలల్లోనే హెచ్‌ఇసి కోర్సు ఉంది. వీటిల్లో మొత్తం 21 వేల సీట్లు ఉండగా, వీటిల్లో సుమారు 16 వేల సీట్లు భర్తీ అయ్యాయి. ప్రైవేట్ కళాశాలలు ఈ కోర్సును అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. అయినా ఇంటర్మీడియట్ విద్యామండలి ఇష్టానుసారం అనుమతులు ఇచ్చేస్తూ మిగతా 5లో



భగత్‌సింగ్ చిత్రపటం, హరికిషన్‌సింగ్ సుర్జిత్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

స్ఫూర్తి ప్రదాతలకు సిపిఎం జేజేలు

స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, హరికిషన్ సింగ్ సుర్జిత్‌కు పొలిట్‌బ్యూరో ఘననివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు సిపిఎం నేతలు ఘన నివాళు లర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సుర్జిత్‌కు కూడా ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి (షహీద్ దివస్), హరికిషన్‌సింగ్ 109వ జయంతి సందర్భంగా ఆదివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాశ్ కరత్ సుర్జిత్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాన్ని, వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఎం వ్యవస్థాపకులలో ఒకరు, మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సుర్జిత్ చివరి వరకూ కమ్యూనిస్టు ఉద్యమానికి అందించిన సేవలను కొనియాడారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణి అలీ, బివి రాఘవులు, ఎంఎ బేబీ, అశోక్ ధావలే, ఎంవి గోవిందన్, తపన్ సేన్, సూర్యకాంత్ మిశ్రా, జి. రామకృష్ణన్, ప్రత్యేక ఆహ్వానితులు ఎస్ రామచంద్రన్ పిళ్లై, కేంద్ర కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛాలతో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

యువ హృదయాలపై చెరగని ముద్ర

- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు సిఎం నివాళి

2

ఆస్తి పన్ను పెంపు నిలిపివేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ
- 100 శాతం పెరుగుదలపై ఆందోళన
- 'కూటమి' హామీ అమలుకు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణాల్లో ఆస్తి పన్ను పెంపుదలకు సంబంధించి మున్సిపల్ సవరణ చట్టం 44/2020 రద్దు చేయాలని, ఆస్తి పన్ను పెంపు నిలిపేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. గత ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో ఆస్తి పన్ను మదింపు విధానాన్ని మార్చుతూ మున్సిపల్ కార్పొరేషన్ చట్టాల్లో సవరణ చేస్తూ 2020 నవంబర్ 11న ఆర్డినెన్స్ 16/2020ను విడుదల చేసిందని తెలిపారు. ఈ ఆర్డినెన్సును సవరణ చట్టం 44/2020గా అసెంబ్లీలో ఆమోదించారని వెల్లడించారు. అప్పటి వరకు ఉన్న అద్దె విలువలపై ఆస్తి పన్ను (ఇంటి పన్ను) మదింపు చేసే విధానాన్ని మార్చుతూ, ఆస్తి కేపిటల్ విలువపై ఆస్తి పన్ను మదింపు చేసే విధానాన్ని ఈ చట్టం ద్వారా ప్రవేశపెట్టారని వివరించారు. దీనిని అమలు జరపడం కోసం రూల్స్ రూపొందించి ఆర్డినెన్సు విడుదల చేసిన మరుసటిరోజు 2020 నవంబర్ 24న జిఓ 198ను విడుదల చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి 0.25 శాతం అదనపు అప్పుకు అనుమతి పొందడం కోసం ఈ చట్ట సవరణ చేశారని వెల్లడించారు. కేవలం ఒకసారి అప్పు పొందడం కోసం ప్రజలపై శాశ్వత భారాన్ని మోపే చట్ట సవరణను చేశారని పేర్కొన్నారు. ఆనాడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజానీకం వ్యతిరేకించారని, టిడిపి కూడా ఆనాడు వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వస్తే ఆస్తిపన్నును సమీక్షిస్తామని ఎన్నికల్లో వాగ్దానం కూడా చేశారని తెలిపారు. ఆస్తిపన్ను భారాన్ని తగ్గిస్తారని ప్రజలు ఆశించారని, కానీ నేటికీ సమీక్షించలేదని పేర్కొన్నారు. అద్దె విలువపై పన్ను విధించడం సరైందని, అందుకు భిన్నంగా కేపిటల్ విలువపై పన్ను విధించడం సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేపిటల్ విలువ అనేది రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రేషన్ విలువ నిర్ణయించడం కోసం ఈ విలువలను ప్రభుత్వాలు దాదాపు ఏటా పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇటీవల పెంచిందని తెలిపారు. ఈ విలువకు ఆస్తి పన్నును లింకు చేయడం వల్ల ప్రభుత్వం ఆస్తులు మార్కెట్ విలువ పెంచిన ప్రతిసారీ ఆస్తి పన్ను కూడా పెరుగుతుందని వెల్లడించారు. ప్రస్తుత ఆస్తి పన్ను ఏటా 15 శాతం చొప్పున పెంచుతున్నారని, ఇలా పెంచడం వల్ల ఈ చట్టం వచ్చిన మిగతా 5లో

మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. దాదాపు నెల రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వ్యాధి కోళ్లకు సోకిందన్న సమాచారంతో సరిహద్దులో నిఘా పెట్టి తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. తాజాగా నల్గొండ జిల్లాలో కోళ్ల ఫామ్‌లలో కోళ్లకు బర్డ్ ఫ్లూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ శివారులోని చిట్యాల మండలం గుండ్రాంపల్లి కోళ్ల ఫామ్‌లో సుమారు రెండు లక్షల కోళ్లను చంపి వాటిని నాలుగు అడుగుల లోతు గుంత తీసి జెసిబి సహాయంతో పూడ్చేశారు. తెలంగాణ వ్యాప్తంగా కోళ్ల పామ్‌లలో పరీక్షలు నిర్వహించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బర్డ్ ఫ్లూ ఉన్న కోళ్ల ఫామ్‌కు పది కిలోమీటర్ల పరిధిని రెడ్ జోన్‌గా పరిగణిస్తున్నామని, ఆ ప్రాంతాన్ని మూడు జోన్‌లుగా విభజించి పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. హైదరాబాద్ శివారులో బర్డ్ ఫ్లూ కలకలం రేపడంతో ఆదివారం నగరంలో చికెన్ విక్రయాలు భారీగా తగ్గాయి. చేపలు, మటన్‌కు గిరాకీ పెరిగింది.

'కౌలు' చట్టంపై యూటర్న్!

- రెండవ బడ్జెట్ అసెంబ్లీలోనూ రాని యాక్ట్
- నవంబర్‌లోనే తెస్తామన్నారు
- అన్నదాతా.. సహా పథకాలకు వాస్తవ సాగుదార్లు దూరం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కౌలు రైతుల గుర్తింపునకు ప్రతిబంధకంగా తయారైన పంట సాగుదారు హక్కు చట్టం (సిసిఆర్‌సి) స్థానంలో కొత్తగా సరళతర చట్టం తెస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకొచ్చిన తొలినాళ్లల్లో కౌలు రైతుల సంక్షేమం కోసం కొత్త చట్టం తెస్తామని ఒకటికి పది సార్లు ఢంకా భజాయించింది. గత నవంబర్‌లో నిర్వహించిన తొలి వార్షిక బడ్జెట్ సమావేశాల్లోనే చట్టం తీసుకొస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పలు తడవలు చెప్పారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన బడ్జెట్ ప్రసంగంలో, అప్పుడే వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ మంత్రి అచ్చెన్నాయుడు చట్టం తెస్తామని నొక్కివక్కాణించారు. తదుపరి ఫిబ్రవరి 24 నుంచి నిర్వహించిన రెండవ సంవత్సరం బడ్జెట్ సమావేశాల్లోనైనా చట్టం వస్తుందని కౌలు రైతులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. వ్యవసాయ మంత్రి తన రెండవ బడ్జెట్ ప్రసంగంలో కూడా చట్టం తెస్తామన్నారు తప్ప అదెప్పుడో క్లారిటీ ఇవ్వలేదు. అప్పుడే అనుమానం వచ్చింది. మార్చి 20తో సమావేశాలు ముగియగా చట్టం మాత్రం రాలేదు. దాంతో కౌలు చట్టంపై ప్రభుత్వం యుటర్న్ తీసుకున్నట్లు చర్చ సాగుతోంది. తాత్కాలికంగా వాయిదా వేశారని, కసరత్తు పూర్తి కాలేదని, మొత్తానికే విరమించుకున్నారని పరివిధాలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మనసుంటే అసెంబ్లీతో పని లేకుండా ఆర్డినెన్స్‌కు అవకాశం ఉందనేవారూ ఉన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే రద్దు చేశారు. రెండవ అసెంబ్లీ భేటీలో ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తెచ్చారు. కౌలు రైతుల చట్టంపై మాత్రం ప్రభుత్వం దోబూచులాడుతుంటంపై కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అడ్డంకి అన్నారుగా...

ఎన్నికల్లో 'ప్రజాగళం' పేరిట కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలో కౌలు రైతులకు గుర్తింపుకార్డులందజేసి అన్ని సంక్షేమ పథకాలనూ, పంటల బీమాను వర్తింపజేస్తామని హామీ ఇచ్చింది. కౌలు రైతుల గుర్తింపునకు వైసిపి సర్కారు తీసుకొచ్చిన సిసిఆర్‌సి చట్టంలో భూయజమాని రాతపూర్వక అనుమతి తప్పనిసరి చేసింది. ఈ నిబంధన కౌలు రైతుల గుర్తింపునకు అడ్డంకిగా తయారైందని, ఆ షరతు ఎత్తేయాలని, అధికారులే గ్రామాల్లో విచారించి కార్డులివ్వాలని వాస్తవసాగుదార్లు డిమాండ్ చేస్తున్నారు. 2011-లో అప్పటి ఉమ్మడి ఎపి ప్రభుత్వం రుణ అర్హత కార్డుల (ఎల్ఇసి) చట్టం తీసుకొచ్చింది. ఆ ప్రకారం రెవెన్యూ అధికారులు నేరుగా విచారించి కౌలు రైతులను గుర్తించాలి. రాష్ట్ర విభజన అనంతరం ఎల్ఇసిలకు సమాంతరంగా 2015 నుంచి వ్యవసాయశాఖ ద్వారా పంట సాగు ధ్రువీకరణ పత్రాల (సిఒసి)లను టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2019లో అధికారంలోకొచ్చిన వెంటనే వైసిపి ప్రభుత్వం ఎల్ఇసి చట్టాన్ని రద్దు చేసి సిసిఆర్‌సి చట్టం మిగతా 5లో

బలభద్రపురంలో మొక్కుబడి సర్వే

- స్క్రీనింగ్ పరీక్షలు లేకుండానే వైద్య, ఆరోగ్య శాఖ రిపోర్టు
- గత రెండేళ్లలో 65 మందికిపైగా కేన్సర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టిన కేన్సర్ సర్వేపై లోపాలు ఉన్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ గ్రామంలో కేన్సర్ కేసులు పెరుగుతుండడంతో గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో అధికార యంత్రాంగం చేపట్టిన సర్వే మొక్కుబడిగా సాగుతోంది. కేవలం పది ప్రశ్నలతో తయారు చేసిన ప్రశ్నావళితో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించి... మీరు ఎప్పుడైనా మమ్మోగ్రామ్ పరీక్ష చేయించుకున్నారా? గర్భాశయ కేన్సర్‌కు సంబంధించి మీరు గతంలో పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకున్నారా? లివర్ కేన్సర్‌కు సంబంధించి తీవ్రమైన కడుపు నొప్పి లేదా కామెర్లు ఉన్నాయా వంటి ప్రశ్నలతో మమ అనిపించేశారు. ఈ ప్రశ్నావళిలో ఉన్న కొన్ని ప్రశ్నలు ఆరోగ్య శాఖ సిబ్బందిలోని పలువురు సామాన్యులకు అర్థం అయ్యే పరిస్థితి లేదు. ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలు సేకరించి కేవలం 24 గంటల్లోనే 50 శాతం సర్వేను పూర్తి చేశారు. సాధారణ సగటు రేషియో పరిమితిలోపే ఉన్నాయంటూ రిపోర్టులో వెల్లడించారు. కేన్సర్‌ను గుర్తించేందుకు స్క్రీనింగ్ టెస్టులు తప్పనిసరి. ఆంకాలజిస్ట్ పర్యవేక్షణలో ధ్రువీకరించాలి. ఇటువంటి పరీక్షలు ఏమీ చేయకుండానే సర్వే పూర్తి చేసేందుకు సంసిద్ధమవడం, కాలుష్య తీవ్రతపై విచారణ చేపట్టాల్సిన కాలుష్య నియంత్రణ మండలి చోద్యం చూడడం పాలకుల చిత్తశుద్ధికి దర్పణం పడుతోంది.

గ్రాసిమ్ పరిశ్రమ ఏర్పాటుకు టిడిపి, వైసిపి సహకారం

దేశంలోనే అతి పెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిమ్ పరిశ్రమ ఏర్పాటుకు వైసిపి, టిడిపిలు సహకారం అందించాయి. ఈ పరిశ్రమ ఏర్పాటుకు 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కొన్ని సాంకేతిక కారణాల వల్ల సంస్థ ఏర్పాటు కాలేదు. అనంతరం 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక పరిశ్రమ ఏర్పాటుకు చకచకా అనుమతులు ఇచ్చేశారు. ఈ పరిశ్రమ గురించి ప్రజల్లో అవగాహన రావడంతో గ్రామంలోకి పరిశ్రమకు చెందిన వాహనాలు రాకుండా ముట్టడించారు. దాదాపు రెండు మాసాలపాటు ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలో 131 మందిపై కేసులు నమోదయ్యాయి. గత ప్రభుత్వం ప్రజల ఆందోళనలను పరిగణలోకి తీసుకోలేదు. అప్పటి ఎంఎల్ఎ చొరవతో ఈ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులిచ్చేశారు. ఈ పరిశ్రమలో కాస్టిక్ సోడా, బ్లీచింగ్, క్లోరిన్, హెచ్‌సిఎల్, హైపో బ్లీచింగ్, సల్ఫ్యూరిక్ యాసిడ్ తదితర 56 రకాల రసాయనాల తయారీ సాగుతోంది. ఈ పరిశ్రమ వ్యర్థాలను పైపులైన్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కెమికల్స్ ఉత్పత్తి సందర్భంగా వెలువడే విష వాయువులు గాలిలో కలుస్తుండడంతో ప్రజారోగ్యాన్ని తీవ్రంగా కబళిస్తోంది. పరిశ్రమకు ముడిసరుకును తరలించే భారీ వాహనాల రాకపోకల వల్ల ఈ ప్రాంతం నిత్యం దుమ్ము, ధూళితో నిండిపోతోంది. ఇక్కడ శబ్ద, జల కాలుష్యాలు అనూహ్యంగా పెరిగాయి.

గడిచిన రెండేళ్లలో 25 మంది మృతి

ఈ గ్రామంలో ఏ వీధిలో చూసినా కేన్సర్ బాధితులే ఉన్నారు. ఈ వ్యాధికి గురైనట్లు తెలిసిన కొద్ది రోజులకే మృత్యువాత పడుతున్నారు. కేన్సర్ చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చవుతోంది. కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు చికిత్స కోసం పరుగులు పెడుతున్నారు. ఈ గ్రామంలో 2,492 గృహాలు ఉన్నాయి. సుమారు పది వేల జనాభా ఉంది. గడిచిన రెండేళ్లలో కేన్సర్‌తో 25 మంది మృతి చెందారు. ఇప్పటికీ 40 మంది కేన్సర్ బాధితులు ఉన్నారు. రాజకీయంగా చైతన్యవంతమైన ఈ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగిన సిబ్బంది కూడా అందుబాటులో లేరు. ఈ గ్రామస్తులు పది కిలోమీటర్లు వెళ్తే తప్ప సరైన వైద్య సదుపాయాలు లేవు. గ్రామంలో ఇప్పటికీ చేతి పంపులు, బావుల నీటినే వినియోగిస్తున్నారు. పారిశ్రామిక వ్యర్థాలు, తాగునీరు కలుషితం కావడంతో కేన్సర్ వస్తోందనే అభిప్రాయం ఇక్కడి ప్రజల్లో వ్యక్తమవుతోంది.



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

కాలుష్య నియంత్రణ మండలి చోద్యం చూస్తోంది

గ్రామంలో పారిశ్రామిక వ్యర్థాల కారణంగా కేన్సర్ వస్తోందని అభిప్రాయపడుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి పూర్తి స్థాయి విచారణ జరిపి ఈ ప్రాంతంలో కాలుష్య వివరాలను వెల్లడించాలి. ప్రభుత్వ యంత్రాంగం మభ్యపెట్టే చర్యలు చేపట్టడం సరైంది కాదు. కాలుష్య కారణాలపై చర్యలు చేపట్టకుండా ప్రజలను మభ్యపెట్టడం సరైంది కాదు.

- పెంకే వీర వెంకట రమణ, బలభద్రపురం, స్థానికులు

సమగ్ర సర్వే చేపడతాం

వైద్య, ఆరోగ్య శాఖ లోపభూయిష్టంగా సర్వే చేపట్టింది. 65 మందికి కేన్సర్ వ్యాధి సోకినట్లు మా వద్ద స్పష్టమైన జాబితా ఉంది. కేవలం ఆరోగ్యశ్రీ జాబితా ఆధారంగా రిపోర్టు వెల్లడించడం సరికాదు. సమగ్ర సర్వే చేపడతాం. సోమవారం నుంచి హోమీబాబా, స్వతంత్ర హాస్పిటల్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి వైద్య అధికారులు వస్తున్నారు. స్క్రీనింగ్ టెస్టులకు కావాల్సిన యంత్ర పరికరాలను తీసుకొస్తున్నారు. ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉంది. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా కూడా కారణాలను విశ్లేషిస్తాం.

-నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, ఎంఎల్ఎ, అనపర్తి.

నీటి నాణ్యత తక్కువగా ఉన్నట్లు గతంలో రిపోర్టు

గ్రామంలో ఐదు వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గతంలో తాగునీటి పరీక్షలు నిర్వహించారు. నీటి నాణ్యత తక్కువగా ఉందని రిపోర్టు ఇచ్చారు. తాజా పరిణామాల నేపథ్యంలో మరోసారి టెస్టులు చేపట్టారు. ఈ రిపోర్టులు రావాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించాం. గత ప్రభుత్వ హయాంలో రుడా నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. పరిశ్రమ యాజమాన్యం రుడాకు చెల్లించిన రూ.8.27 కోట్లలో ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా గ్రామానికి నిధులు చెల్లించలేదు.

-బి.రామారావు, సర్పంచ్, బలభద్రపురం.

యువ హృదయాలపై చెరగని ముద్ర

- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు సిఎం నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. భరతజాతికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించడానికి 23 ఏళ్ల వయసులోనే వీరోచిత పోరాటాలు చేసి యువ హృదయాలపై చెరగని ముద్ర వేసిన స్వాతంత్ర్య సమరవీరులని ఎక్స్‌లో ఆదివారం పేర్కొన్నారు. ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేసిన షహీద్ దివస్ సందర్భంగా ఆ అమరవీరుల చరిత్రను మనం చేసుకుంటూ వారి స్మృతికి నివాళులర్పిద్దామని కోరారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారు చేసిన సాహసాలు ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలిచాయని, వారి ఆశయ సాధన కోసం పునరంకితమవుదామని కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఇఫ్తార్ విందు

- ప్రభుత్వ నిర్ణయం
- 27న విజయవాడలో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 1.50 కోట్ల రూపాయలను కేటాయిస్తూ ఉత్తర్వులను విడుదల చేసింది. రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఈ నెల27న విజయవాడ ఎంజి రోడ్డులోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ కోసం రూ.75లక్షలు, జిల్లాల్లో ఇఫ్తార్ కోసం మరో రూ.75లక్షలను ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల కలెక్టర్లు రానున్న 4,5 రోజుల్లో జిల్లా స్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని వారికి అనువైన రోజున నిర్వహించాల్సి ఉంటుంది. ఇఫ్తార్ ను జిల్లా స్థాయిలో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని మైనార్టీ మంత్రిత్వశాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల్లో ముస్లిం మైనార్టీ జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపులు చేసినట్లు మైనార్టీ శాఖ వెల్లడించింది. శ్రీకాకుళం రూ.1.50లక్షలు, విజయనగరం రూ.1.50లక్షలు, మన్యం రూ.1లక్ష, అల్లూరి సీతారామరాజు రూ.1లక్ష, విశాఖపట్నంరూ.3లక్షలు, అనకాపల్లి రూ.2లక్షలు, కాకినాడ రూ.3లక్షలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమకు రూ.3లక్షలు, తూర్పుగోదావరి రూ.3లక్షలు, పశ్చిమ గోదావరి రూ.3లక్షలు, ఏలూరు రూ.3లక్షలు, కృష్ణ రూ.3లక్షలు, గుంటూరు రూ.4లక్షలు, బాపట్ల రూ.3లక్షలు, పల్నాడు రూ.3లక్షలు, నెల్లూరు రూ.5లక్షలు, కర్నూలు రూ.4లక్షలు, నంద్యాల రూ.5లక్షలు, అనంతపురం రూ.3.5లక్షలు, వైఎస్ఆర్ కడప రూ.3.50లక్షలు, అన్నమయ్య రూ.4లక్షలు, చిత్తూరు రూ.3లక్షలు, శ్రీబాలాజీ (తిరుపతి) జిల్లాకు రూ.3లక్షలు నిధులు కేటాయిస్తూ నిర్వహణా బాధ్యతలను ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

అన్న క్యాంటీన్‌కు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రూ.1,0001,016లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఫౌండర్, ఛైర్మన్ నార్నే రంగారావు కుటుంబ సభ్యులు అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రంగారావు సతీమణి శాంతారావు, కుమార్తె దీప, వైట్ ఫీల్డ్ బయో ఎమ్‌డి అడుసుమల్లి నరేష్‌కుమార్‌తో కలిసి ఆదివారం అందజేశారు. పేదలకు రూ.5లకే అన్నం పెట్టాలనే ఆలోచనకు ఇలాంటి వారి మంచి మనసు ఎంతో దోహదం చేస్తుందని సిఎం ఈ సందర్భంగా అన్నారు.

కృష్ణభారతి మృతి పట్ల సిఎం సంతాపం

గాంధేయ వాది, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన వసల కృష్ణభారతి మృతి పట్ల సిఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆమె మరణ వార్త తనకు బాధ కలిగించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వసల కృష్ణమూర్తి-అంజలక్ష్మి దంపతుల కుమార్తె కృష్ణభారతి జీవితాంతం గాంధేయవాదిగా ఉన్నారని తెలిపారు. గాంధీజీ బోధించిన విలువలను పాటించారని, అట్టడుగు వర్గాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేశారని వివరించారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



రైతుతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలోని కరటంపాడు, బోయిల చిరివెళ్ల, ఆత్మకూరు గ్రామాల్లో సిపిఎం కార్యదర్శి మూలం రమేష్‌తో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ధాన్యం కొనుగోలు ఎలా సాగుతుందో పరిశీలించారు. ధాన్యం అమ్మకంలో ఎదురవుతున్న సమస్యల గురించి రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. గోనె సంచులను ప్రభుత్వం సకాలంలో అందించకపోవడంలో, రవాణా కోసం ఏర్పాటు చేస్తున్న లారీల విషయంలో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రతిరోజూ ధాన్యాన్ని ఆరబోయడం, మరలా బస్తాలకు ఎత్తడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం గోనె సంచులు సరఫరా చేయాలని, రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

- పిఆర్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం కృష్ణతేజ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అన్ని జిల్లాల డిపిఒలకు, జడ్‌పి సిఇఒలకు ఆదివారం సర్క్యులర్ జారీ చేశారు. గ్రామాల్లో కూడళ్ళు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు వెళ్లకుండా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే టోపీ ధరించడం, గొడుగు వాడాలని కోరారు. తరచూ నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తాగడం, తీసుకునే ఆహారంలో పోషక విలువలు ఉండేలా సూచించాలన్నారు. పిహెచ్‌సిల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐస్ ప్యాక్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులను తెల్లవారుజామున ప్రారంభించి, ఎండ తీవ్రత పెరిగే లోపు ముగించేటట్లు సూచనలు చేయాలన్నారు.

ఉల్లాస్ పరీక్షకు 94.4 శాతం హాజరు

- ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమం కింద నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పరీక్షకు 94.4 శాతం హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, వయోజన విద్య డైరెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18,485 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 4,15,000 మందికి 3,91,837 హాజరయ్యారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ పరీక్షకు నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ అందించిన ప్రశ్నపత్రాన్ని ఉపయోగించారని తెలిపారు. జాతీయ స్థాయి పరిశీలకులు కుల్దీప్ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యాశాఖ, మహిళా, శిశుసంక్షేమ శాఖ సహకారంతో పరీక్ష విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు.

31లోపు రేషన్ కార్డుదారుల ఇకెవైసి చేయించుకోవాలి

- సౌరబ్‌గౌర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులు ఈ నెల 31లోపు ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులను పౌరసరఫరాలశాఖ కమిషనరు సౌరబ్‌గౌర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులకు తాజాగా సర్క్యులర్ జారీ చేశారు. ఇకెవైసి యూనిట్లు రేషన్ డీలర్లు, తహశీల్దార్లు, డిఎస్‌ఒల లాగిన్‌లలో యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని మొబైల్ యాప్, రేషన్ షాపుల్లోని ఈ పోస్ పరికరాల ద్వారా అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఇకెవైసి నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

బటన్ నొక్కితే సమస్యలు పరిష్కారం కావు : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ప్రభుత్వంలో అభివృద్ధిని విస్మరించి కేవలం బటన్ నొక్కి ప్రజలకు డబ్బు పంపిణీపైనే దృష్టి పెట్టారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బటన్ నొక్కితే సమస్యలు పరిష్కారం కావని, సమర్థవంతమైన నాయకత్వం ఉండాలని అన్నారు. గుంటూరు జిల్లా పొన్నూరులో ఆదివారం జరిగిన అంజుమన్ - ఏ - ఇస్లామియా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందన్నారు. గుంటూరులో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. పిఎంజిఎస్‌వై ద్వారా నిధులు సేకరించడం, పొన్నూరులో రైళ్ల నిలుపుదల తదితర సమస్యలను పరిశీలిస్తామన్నారు.

పరిహారం, పునరావాసం అందలేదు

- ప్రజా చైతన్య యాత్రల్లో పోలవరం నిర్వాసితులు ఆవేదన

ప్రజాశక్తి-యంత్రాంగం



కర్నూలులో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు ఆదివారం పలు జిల్లాల్లో సాగాయి. పలుచోట్ల సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను సిపిఎం నేతల ఎదుట ఏకరువు పెట్టారు. ఇళ్ల స్థలాలు, రోడ్లు, విద్యుత్ ఛార్జీలు, డ్రెయినేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పెషల్ డిఎస్‌సి వస్తుందని ఆశగా ఎదురు చూసిన తమకు నిరాశే మిగిలిందని గిరిజన యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 3ని పునరుద్ధరించాలని కోరారు. 2013 భూసేకరణ చట్టప్రకారం న్యాయమైన పరిహారం, పునరావాసం అందలేదని పోలవరం నిర్వాసితులు వాపోయారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలపై పలువురు గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వంకవారిగూడెం, జీలుగుమిల్లి రహదారి మధ్యలో వంతెన నిర్మాణం చేపట్టాలని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెంలో ఇళ్ల స్థలాలు, రోడ్లు, అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలు, డ్రెయినేజీ సమస్యలను సిపిఎం నేతల దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. పోలవరంలో.. 2013 భూసేకరణ చట్టప్రకారం పోలవరం నిర్వాసితులందరికీ న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. జిఒ 3ను పునరుద్ధరించాలని, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని కోరారు. కర్నూలులోని 42, 43 వార్డుల పరిధిలో సిపిఎం నేతలు పర్యటించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడి చేపట్టనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కర్నూలు జిల్లా ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరులోనూ ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. పలు సమస్యలను స్థానికులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. విశాఖ జివిఎంసి 70వ వార్డు పరిధి దశమికొండలో సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి సమస్యలపై సర్వే చేశారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కొండిబ పంచాయతీ గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. జడ్‌పిటిసి సభ్యులు గంగరాజు గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తులసిరెడ్డి

నీటి వనరులతోనే మెట్ట ప్రాంతాల అభివృద్ధి

- తులసిరెడ్డి

ప్రజాశక్తి-ఉదయగిరి (నెల్లూరు జిల్లా)

వెనుకబడిన మెట్ట ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే నీటి వనరులతోనే అది సాధ్యమవుతుందని రాయలసీమ తొమ్మిదవ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా ఉదయగిరిలోని షాదీ మంజిల్ ఆవరణలో వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగు నీరు, 15 లక్షల మందికి తాగునీరు అందిచొచ్చని తెలిపారు. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు సంక్షేమ రంగంపై మక్కువ చూపుతూ సాగు నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని విమర్శించారు. ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా వెంకయ్య, సిపిఎం నాయకులు కటారి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. వెలిగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హై లెవెల్ కెనాల్ సాధన కోసం పోరాటాలకు ముందుకు రావాలని కోరారు. వెలగొండ సాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆక్రమణదారుల చేతుల్లో వక్ఫ్ భూములు

- నత్తనడకన సాగుతున్న డిజిటలైజేషన్
- ఆందోళనలో మైనార్టీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. పలు నగరాల్లో వక్ఫ్ భూముల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సముదాయాలు వెలిశాయి. భూములు అన్యాక్రాంతమైన విషయాన్ని శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మైనార్టీశాఖ మంత్రి ఫరూఖ్ అంగీకరించారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి? అందులో కమర్షియల్ వినియోగానికి పనికి వచ్చే ఆస్తులు ఏమిటీ? వ్యవసాయభూములుగా ఉండే ఆస్తులు ఏమిటీ? ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న భూమి విస్తీర్ణం ఎంత? ఆస్తులు రక్షించాల్సిన బాధ్యులు అమ్ముకున్న దెంత? అనే వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం రికార్డులను డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టింది. ఈ కార్యక్రమం నత్తనడకనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం ఆస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 65,783.88 ఎకరాలు ఉండగా అందులో ఆక్రమణలు 13,874ఎకరాలు. కాగా కోర్టు లిటిగేషన్‌లో ఉన్న భూములు మరో 969.06 ఎకరాలు. మొత్తం మీద కోర్టు కేసులు, ఆక్రమణలు, ఎసిల ద్వారా ఇతరులకు కేటాయించినవి 228.03 ఎకరాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇనామ్ యాక్ట్ అబాలిషన్ ద్వారా 16,751.08 ఎకరాల భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకుంది. ఉమ్మడి జిల్లాలవారీగా పరిశీలిస్తే.. శ్రీకాకుళం జిల్లాలో 1671.22 ఎకరాల భూమి ఉండగా అందులో 261.55 ఎకరాలు అక్రమణలకు గురయ్యాయ. విజయనగరం జిల్లాలో 23.54ఎకరాలు ఉండగా అందులో భూమి ఆక్రమణకు గురికాలేదు. విశాఖపట్టణంలో 7,800.61 ఎకరాలు ఉండగా అందులో 2598.20 ఎకరాలను స్వాధీనం చేసుకోగా, మరో 2226.42ఎకరాలు ఆక్రమణలకు గురైంది. తూర్పుగోదావరిలో 1810.70 ఎకరాల భూమి ఉండగా అందులో 18.43ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకోగా, 1659.17ఎకరాలు అన్యక్రాంతమైంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 971.23 ఎకరాల్లో 667.31 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైంది. కృష్ణ జిల్లాలో 2663.56 ఎకరాలు ఉండగా అందులో 299.99 ఎకరాలు స్వాధీనం చేసుకోగా 984.08 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. గుంటూరు జిల్లాలో 3670.83 ఎకరాలు ఉండగా అందులో 144.28 ఎకరాలు తిరిగి స్వాధీనం చేసుకోగా, 467.81 ఎకరాలు ఆక్రమణల దారుల చేతుల్లో ఉంది. ప్రకాశం జిల్లాలో 4321.52 ఎ కరాలు ఉండగా అందులో 3299.25 ఎకరాలు అన్యక్రాంతమైంది. నెల్లూరు జిల్లాలో 1279.50 ఎకరాల్లో 1040.21 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. చిత్తూరు జిల్లాలో 6671 ఎకరాలకుగాను , 12.49ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకోగా 146.84 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. అనంతపురంలో 10,340 ఎకరాలు ఉండగా అందులో 86.80 ఎకరా లను స్వాధీనం చేసుకోగా ఇంకా 290.45ఎకరాలు ఆ క్రమణదారుల చేతుల్లో ఉంది. వైఎస్ఆర్ కడపలో 1960 ఎకరాలు ఉండగా, అందులో 47.61 ఎకరాలు స్వాధీనం చేసుకోగా ఇంకా 371.46ఎకరాలు ఆక్రమణదారుల కింద భూములు ఉన్నాయి. కర్నూలులో 22,599 ఎకరాలు ఉండగా, అందులో 1200.42 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోగా, 2459.51 ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి.

'సహకారం'లో అవినీతిపై త్వరలో విచారణ

- ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర సహకార బ్యాంకులు (ఆప్కాబ్), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (డిసిసిబి) పెద్దయెత్తున అవినీతి జరిగిందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.5 వేలకోట్ల వరకు అవినీతి జరిగి ఉండొచ్చని, ఒక్క కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే రూ.700 కోట్ల వరకు జరిగి ఉండొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సభా సంఘం (హౌస్ కమిటీ)ని వేసింది. 2019-24 మధ్య భారీ స్థాయిలో అవినీతి జరిగిన మాట నిజమేనని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శాసనసభలో వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయి విచారణ జరిపిస్తున్నామని, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ అవినీతి జరిగినమాట నిజమేనని ఆయన వెల్లడించిన విషయం తెలిసిందే. అవినీతిపై ఒకవైపు అధికారులతో విచారణ జరుగుతుండగా మరోవైపు హౌస్ కమిటీని తాజాగా వేయడంతో ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దీంతో పిఎసిఎస్, కేంద్ర సహకార బ్యాంకుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఉద్యోగుల్లో ఉలికి పాటు మొదలైంది. హౌస్ కమిటీని వేసిన ప్రభుత్వం మరో వారం పది రోజు ల్లో కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది. సభ్యుల నియా మకం పూర్తి కాగానే 2019-24 మధ్య కేంద్ర సహకార బ్యాంకులు, పిఎసిఎస్‌లో జరిగిన అవినీతిపై లోతైన విచారణ ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో విచారణలో ఎటువంటి విషయాలు బహిర్గతం అవుతా యోననే ఆందోళన ఆయా ఉద్యోగుల్లో నెలకొంది. అలాగే అక్రమాలను ప్రోత్స హించి తెర వెనుక కథ నడిపిన పిఎసిఎస్ అధ్యక్షులుగా వ్యవ హరించిన వారితోపాటు ద్వితీయశ్రేణి నేతలు, ప్రజా ప్రతినిధులపై పిఎసిఎస్ సెక్రటరీలు ఒత్తిడి పెంచినట్లు సమాచారం. నేతల ఆదే శాలతో తమకు సహకరించామని, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో తాము ఇబ్బందులు ఎదుర్కోక తప్పని పరిస్థితులు నెలకొ న్నాయని నేతల వద్ద ఆయా ఉద్యోగులు వాపోతున్నట్లు తెలిసింది. నకిలీ పత్రాలతో రుణాలు పొందిన వారితో ఎంతో కొంత బకాయిలు కట్టించాలని ఆయా నేతలకు విజ్ఞప్తులు చేసే వారి సంఖ్య ఎక్కువైనట్లు సమాచారం.

యాత్రికులతో శ్రీశైలం కిటకిట

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

ఉగాది నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తోన్న యాత్రికులతో శ్రీశైల క్షేత్రం కిటకిటలాడుతోంది. ఉగాది ఉత్సవాలకు అధికారులు పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లూ చేశారు. కాలినడకన వస్తోన్న యాత్రికుల కోసం కైలాస ద్వారం వద్ద స్వచ్ఛంద సేవా సంస్థల వారు అన్నదాన కేంద్రం ఏర్పాటు చేశారు. శ్రీశైలంలోని కంపార్టుమెంట్లు, క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. యాత్రికుల రాకతో నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడినా తిరిగి రాకపోకలు సాగాయి. వెంకటాపురం, పెచ్చెర్వు, భీమునికొలను నడక మార్గంలో దేవస్థానం వారు తాగు నీరు, అల్పాహారం, ఉచిత వైద్యం కేంద్రాలను ఏర్పాటు చేశారు.



కాలినడకన శ్రీశైలం చేరుకుంటున్న యాత్రికులు


సరస్వతి (ఫైల్)


కృష్ణ (ఫైల్)

బైక్‌ను ఢీకొన్న లారీ

- తిరువూరులో తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి - తిరువూరు

బైక్‌ను లారీ ఢీకొనడంతో తల్లి కొడుకు మృతి చెందిన ఘటన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అరిసేపల్లి సరస్వతి (70) తన కుమారుడు కృష్ణ (53)తో కలిసి బైక్‌పై ఆదివారం ఖమ్మం జిల్లా, అశ్వారావుపేట మండలంలోని తమ బంధువుల ఇంట్లో జరిగే ఫంక్షన్‌కి బయలుదేరారు. దమ్మపేట వద్ద అశ్వారావుపేట వెళ్లే జాతీయ రహదారిపై గాంధీనగర్ గ్రామం వద్ద బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సరస్వతికి భర్త, కుమార్తె ఉన్నారు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఉక్కు కార్మికుల 'ఉపాధి రక్షణ యాత్ర'

- ఉక్కు కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దంటూ డిమాండ్
- కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెం వరకూ పాదయాత్ర
- పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటాం : సిహెచ్.నర్సింగరావు



పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆదివారం 'ఉపాధి రక్షణ యాత్ర' జరిగింది. విశాఖలోని కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు సాగిన ఈ పాదయాత్రలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేశారు. 50 సంవత్సరాల వయసులో ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఎలా బతకగలమని, కనీసం వాచ్‌మ్యాన్ ఉద్యోగం కూడా రాదని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్ర అనంతరం కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. పోరాటాల ద్వారానే విశాఖ ఉక్కును కాపాడుకోగలమని తెలిపారు. బెదిరింపులకు కాంట్రాక్టు కార్మికులు తలొగ్గరన్నారు. తక్కువ జీతంతో ప్రాణాలను ఫణంగా పెట్టి వారు పనిచేస్తున్నారని తెలిపారు. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసి రెండు లక్షల కోట్ల రూపాయల విలువగల ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఐక్య పోరాటాలతో దాన్ని తిప్పికొడతామని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ బంగారు గని, బంగారు బాతు గుడ్డు వంటిదని, అందుకే దీనిపై కార్పొరేట్ల కన్ను పడిందని తెలిపారు. దీన్ని ప్రయివేటుపరం చేయడం ఎవరి తరమూ కాదన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం తప్పక విజయం సాధిస్తుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం చారిత్రాత్మకమైనదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎన్నికలకు ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలు గడుస్తున్నా ఆ దిశగా కృషి చేయడంలేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని సిఎం చంద్రబాబును కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్‌కు ప్లాంట్ యాజమాన్యం షోకాజ్ నోటీసు ఇవ్వడం దారుణమన్నారు. పోరాట కమిటీ నాయకుల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు దుర్మార్గమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు ఇచ్చిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగాలకైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందన్నారు. కార్మికుల తొలగింపు చర్యలను విడనాడకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ప్లాంట్ యాజమాన్యం ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. మెడికల్ టెస్టుల పేరుతో కొంతమందిని ఇంటికి పంపేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, వైటి.దాస్, ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు ఎం రవి, వంశీ, గురునాధరావు, ఉమ్మిడి అప్పారావు, ఉరుకూటి అప్పారావు పాల్గొన్నారు. పాదయాత్రకు వైసిపి గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి మద్దతు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

కథా రచనలలో చిన్నారుల ప్రతిభ అద్భుతం

- మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ గోపి మూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

కథా రచనలలో చిన్నారుల ప్రతిభ అద్భుతమని, గోదావరి బాలల కథలు పుస్తకం వారిలోని సృజనాత్మకతకు దర్పణం పట్టిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. గోదావరి బాలల కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గోదావరి బాలోత్సవం, బాలమందిరం సంయుక్త ఆధ్వరంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంహిత కాలేజీలో ఆదివారం గోదావరి బాలల కథలు పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. గోదావరి బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు విఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా మంత్రి దుర్గేష్ మాట్లాడారు. కవులు, కళాకారులకు రాజమహేంద్రవరం పుట్టినిల్లు అని, అటువంటి ఈ ప్రాంతంలో చిన్నారులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు రచనలను ప్రోత్సహించే దిశగా గోదావరి బాలోత్సవం, బాలమందిరం చేసిన ప్రయత్నం అభినందనీయమని అన్నారు. చిన్నారులు రాసిన కథలను కొన్నింటిని ప్రస్తావించారు. చిన్నారులు చదువులో, కళారంగాలలోనూ ప్రతిభ చూపాలన్నారు. ఇటువంటి ప్రయత్నానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉభయ గోదావరి టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ చిన్నారులు పాఠాలను ఆట పాటలతో నేర్చుకోవటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమాజ చైతన్యానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి తులసి, అంగర గోపాలకృష్ణాచార్యులు, సత్యజ్యోతి, వి లీలావతి, అద్దేపల్లి ప్రభు, దాసరి సాయిబాబా, వినోద్, పట్నాయక్, అంజలి, లక్ష్మి పాల్గొన్నారు.


మండపేటలో రిలే దీక్షలు చేపట్టిన మహిళలు

మద్యం షాపు తొలగించాలని మహిళల దీక్ష

ప్రజాశక్తి - మండపేట (కోనసీమ జిల్లా)

నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న మద్యం షాపునకు వ్యతిరేకంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో మహిళలు రిలే దీక్షలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సప్తగిరి థియేటర్ ఎదురుగా నూతనంగా మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఆడ బిడ్డలు ట్యూషన్‌లకు వెళ్లి రాత్రి 9 గంటల వరకు ఇంటికి వస్తూ ఉంటారని, ఈ ప్రాంతమంతా మందుబాబులతో నిండిపోతే తమ పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాము ఎంత ఆవేదన వ్యక్తం చేస్తున్నా నిర్వాహకులు దుర్మార్గంగా తమ ముందే నిర్మాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. మద్యం షాపుల కారణంగా ఏ ఒక్క మహిళకూ ఇబ్బంది రాకుండా చూస్తానని మాట ఇచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల్లో స్పందన కనిపించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో మండపేట ప్రాంత వాసులు రావూరి దుర్గాదేవి, పిల్లి నాగమణి, శీలం గనికమ్మ, కేతా దేవి, పిల్లి పద్మ, మురియద్ బేగం, మామిడి లక్ష్మి, లంకపల్లి కుమారి, మద్దూరి దేవి, గుమ్ములూరు మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుళ్ల కదలికలపై 'నిఘా'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐపిఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో బెట్టింగ్ నిర్వాహకులు, బుకీలు, పందెం రాయుళ్ల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టామని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని క్రికెట్ బెట్టింగ్ ద్వారా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని వారిని ప్రలోభపెట్టేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని డిజిపి హెచ్చరించారు. అటువంటి వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. అప్పులు చేసి బెట్టింగ్‌లు పెట్టి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకోవద్దని యువతను కోరారు. యువత బెట్టింగ్ రాయుళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవని, ఈ తరహా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని వ్యవస్థీకృత నేరస్తులుగా పరిగణించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్‌ల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. బెట్టింగ్ ముఠాల చేతిలో మోసపోయిన వాళ్లు ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

హై కోర్టు ఆదేశాలను తక్షణమే అమలు : వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూములు సేకరించిన ప్రాంతాల్లో సర్వం కోల్పోతున్న వ్యవసాయ కార్మికులకు పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని హై కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. 2016-17 మధ్య కాలం అప్పటి ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల పేరుతో సుమారు 5 లక్షల ఎకరాల భూములను సేకరించిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆదివారం విడుదల చేసిన తెలిపారు. ఈ భూ యజమానులైన చిన్న, సన్నకారు రైతులతో పాటు సర్వం కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని 2016లో హై కోర్టును వ్యవసాయ కార్మిక సంఘం ఆశ్రయించిందన్నారు. 2017లో అందరికీ పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు కోర్టు తీర్పును ఉల్లంఘించాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా వంగలి గ్రామంలో పెట్రో కెమికల్ పేరుతో పేదల నుంచి భూములు ప్రభుత్వం లాక్కుందని, ఈ భూములు ప్రభుత్వానికి చెందిన అసైన్మెంట్ భూములని నష్టపరిహారం ఇవ్వకుండా ఉల్లంఘించిందన్నారు. దీనిపై వంగలి గ్రామ ప్రజలు తరుపున హై కోర్టును వ్యవసాయ కార్మిక సంఘం ఆశ్రయించిందని చెప్పారు. ఎట్టకేలకు వంగలి గ్రామంలో ఉన్న నిర్వాసితులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భూములు కోల్పోయిన రైతులకు, భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు పునరావాసం, పునర్నిర్మాణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హై కోర్టు తీర్పు చెప్పిదని తెలిపారు. ఈ తీర్పును ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పేదల కోసం సుదీర్ఘకాలం హై కోర్టులో వాదించిన విజయం చేకూర్చిన న్యాయవాదులు సిహచ్.రవికుమార్, కె.ఎస్.మూర్తి కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.


పార్వతీపురం మన్యం జిల్లాలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

వర్ధంతి వేడుకల్లో పలువురు వక్తలు

ప్రజాశక్తి-యంత్రాంగం

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల స్ఫూర్తితో యువత దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కాగడాల ప్రదర్శన చేశారు. విజయవాడలోని కృష్ణా హోటల్ సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కేవలం 23 ఏళ్లకే ఉరి కంభాన్ని ముద్దాడి ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత సేవా, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నేడు దేశంలో అభివృద్ధి కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉందన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, అవినీతి దేశాన్ని పట్టి పీడిస్తున్నాయని తెలిపారు. భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద, మతోన్మాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని యువత కొనసాగించాలని తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రారంభించారు. అనంతరం పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. బ్రిటీష్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన దీశాలి భగత్ సింగ్ అని, ఆయన ఆశయాల బాటలో యువత నడవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని రోటరీ బ్లడ్ బ్యాంకులో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్.హరీష్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శ్రీశ్రీ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్రీనివాసరావు ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కచేరీ సెంటర్‌లోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. భీమవరంలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం భగత్‌సింగ్‌కు నివాళులర్పించి మాట్లాడారు. భగత్‌సింగ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరంలో దేశంలో పెరుగుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా మతోన్మాది దిష్టిబొమ్మను విద్యార్థి యువజన నాయకులు దహనం చేశారు. తూర్పుగోదావరి, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- యుటిఎఫ్ పోరుబాటలో రాష్ట్ర నేతలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు


ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యారంగంలో నానాటికీ పేరుకుపోతున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ చేపట్టిన పోరుబాటలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పాలకులు ప్రభుత్వ విద్యా విధానానికి పెద్దపీట వేయాలన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే ఉపాధ్యాయుల హక్కుల సాధన సాధ్యమని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు చైతన్యవంతులై కొత్త తరాలను తయారు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ.. జిఒ నెంబర్ 117 రద్దు, పాఠశాలల కుదింపు వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటాలు అనివార్యమని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిపోయిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలపై సరైన శ్రద్ధ చూపడంలేదని తెలిపారు. దీంతో బకాయిలు రూ.30 వేల కోట్లకు పెరిగిపోయాయన్నారు. 29 శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పిఆర్‌సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరుబాట ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఊరి బడిని బతికించుకోవటానికి ఉపాధ్యాయులంతా నడుం కట్టాలన్నారు. అందుకోసం పిల్లలు, తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉనికిని కోల్పోతున్నాయన్నారు. భవిష్యత్తులో మోడల్ పాఠశాలల పేరుతో గ్రామాల్లో చాలా పాఠశాలలను ఎత్తేయ్యాలనే యోచనతో ప్రభుత్వం ఉందని వివరించారు. తొలుత భగత్‌సింగ్, యుటిఎఫ్ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, ఎఐ సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.జ్యోతిబసు, తోటకూర చక్రవర్తి, కె.శ్రీదేవి, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొట్టేందుకు సర్వే!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ప్రాంతంలో విశ్వ హిందూ పరిషత్ ఒక సర్వే చేపట్టింది. ప్రధానంగా క్రైస్తవ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఈ సర్వే జరుగుతోంది. ప్రజల సమస్యలను తెలుసుకోడానికో, వారి సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను తెలుసుకోడానికో సర్వేలు చేయడం మామూలు. కానీ, చాలా అసాధారణమైన రీతిలో విహెచ్‌పి ఉత్తరాంధ్ర విభాగం ఒక సర్వేను చేపట్టింది. ఇది చాలా గోప్యంగా జరుగుతోంది. ఆ సర్వే పత్రం 'ప్రజాశక్తి'కి లభించింది. దానిని పరిశీలిస్తే ఈ సర్వే లక్ష్యం గ్రామాల వారీగా క్రైస్తవులు ఎందరు ఉన్నారో, ముఖ్యంగా దళితవాడల్లో క్రైస్తవులు ఎందరు ఉన్నారో గుర్తించడమేనని స్పష్టమవుతోంది. దానితోపాటు ఆ గ్రామంలో క్రైస్తవ వ్యతిరేకులు ఎవరెవరు ఉన్నారన్న వివరాలను కూడా ఆరా తీస్తున్నారు. విహెచ్‌పి గత చరిత్ర, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే అప్రమత్తం కావాలని, ఇటువంటి సర్వేలను నిషేధించాలని, గ్రామాల్లో ప్రజల మధ్య ఉన్న సామరస్య వాతావరణాన్ని కాపాడాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.


విశ్వ హిందూ పరిషత్-ఉత్తరాంధ్ర ధర్మప్రసార్-సర్వేక్షణ పత్రము

జిల్లా: .... విభాగ్: .... ప్రఖండ్: .... గ్రామము: ....

ధర్మప్రసార్ ప్రముఖ్ పేరు:
చరవాణి:

గ్రామములో ప్రత్యేక ప్రాంతము: హరిజనవాడ/అరుంధతీయవాడ/గిరిజనవాడ/ఇతర వాడలు/సాధారణ గ్రామము

1. మొత్తము గృహాలు(ఇండ్లు) : మొత్తము జనాభా
2. క్రైస్తవులుగా మారిన గృహాలు............మొత్తము జనాభా.........ఎన్ని సం॥ల నుండి మారివున్నారు ?
3. మొత్తము హిందూ దేవాలయాలు: .... మొత్తము చర్చిలు.......... మొత్తము మసీదులు..............
4. గ్రామంలో పాస్టర్ల సంఖ్య...........పాస్టర్లు గ్రామంలోనే నివాసమా,లేక బయట నుండి వస్తారా ?
   గ్రామంలోనే నివాసం :
   బయట నుండి :
5. గ్రామంలో క్రైస్తవానికి వ్యతిరేకులు ఉన్నారా? ఉంటే ముఖ్యమైనవారి 6మంది పేర్లు
   1..........2..........3..........
   4..........5..........6..........
6. గ్రామంలో తటస్థ క్రైస్తవ కుటుంబాల సంఖ్య: .... (నామకే వాస్తవంగా ఉన్నవారు)
7. హిందువులుగా ఉన్నవారిలో మనకు ఉపయోగపడేవారు కనీసం 6 మంది పురుషులు, ఇద్దరు(2) మహిళలు, వారి పూర్తి పేర్లు
   1..........2..........3..........
   4..........5..........6..........
   7..........8..........
8. గ్రామపెద్ద/ప్రముఖ్/గ్రామంలో నాయకత్వం వహించేవారి పేరు, చరవాణి
   పేరు: చరవాణి:
9. గ్రామంలో అర్చక పురోహితుల పేర్లు:
10. హరిజన, గిరిజన పురోహితుల పేర్లు:
11. హిందూ ధర్మ ప్రచారంలో గ్రామంలో ఉన్న వివిధ ధార్మిక ఉపన్యాసకులు, భజన గురువులు, హరికథా వగైరా కళాకారుల పేర్లు:
   1. ఉపన్యాసకులు : 2. భజన గురువులు :
   3. కుల గురువులు : 4. కళాకారులు :
   5. సాదు పంతులు : 6. ఆశ్రమాలు :

సర్వేక్షణ పూర్తి చేసిన తేది
గ్రామ ధర్మప్రసార్ ప్రముఖ్ సంతకము
చరవాణి :

ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి

- శాప్ చైర్మన్ రవినాయుడు
- సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి):

తిరుపతి నగరంలోని ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని, డిఎస్ఎ అధికారులను, శాప్ ఇంజనీరింగ్ అధికారులను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదేశించారు. నిర్ధిష్ట సమయంలోపు పూర్తిచేసి క్రీడాకారులకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. తొలుత శాప్ నిధులు రూ.24 లక్షలతో స్విమ్మింగ్ పూల్ వద్ద చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. వేసవి సెలవుల దృష్ట్యా సమ్మర్ క్యాంపులు ప్రారంభించే నాటికి స్విమ్మింగ్ పూల్‌ను సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 10వ తేదీలోపు స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించి వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో క్రీడా సముదాయంలో చేపడుతున్న పనుల్లో భాగంగా నిలిచిపోయిన కొన్ని పనులను గుర్తించి ఆరా తీశారు. ఫ్లడ్ లైట్లు, సింథటిక్ ఫ్లోరింగ్, మూవ్‌బుల్ బాస్కెట్‌బాల్ పోల్స్ పనులను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో శాప్ ఆధ్వర్యంలో చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించాలన్నారు. రైఫిల్ షూటింగ్ అభివృద్ధికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా పిపిపి విధానం ద్వారా సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఖేల్ రత్న అవార్డు గ్రహీత ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మల్టీపర్పస్ హాలు నిర్మాణం పూర్తయినప్పటికీ ఎసిల ఏర్పాటు, లైటింగ్, పెయింటింగ్, తలుపులు, కిటికీల పనులు మిగిలున్నాయని, వాటిని కూడా వారంలోపే పూర్తిచేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్ లోకేష్ వివరించారు. డిఎస్‌డిఒ సయ్యద్ సాహెబ్, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎఇ రాఘవ, శాప్ ఎఇ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


స్విమింగ్‌పూల్ పనులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు



"మానవుడు శాస్త్ర జ్ఞానాన్ని తప్ప మరే జ్ఞానాన్ని కోరనవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. దానికి విరుద్ధంగా ఉన్న అన్ని అపోహలను, నమ్మకాలను పూర్వపక్షం చేయడం పురోగామి సాహిత్య లక్షణం."
– కొడవటిగంటి కుటుంబరావు



ఆకాశ తార

ఆమె అందరిలాగే
ఓ అమ్మ జన్మనిచ్చిన సాధారణ మనిషి
అసాధారణం పరిశ్రమతో పైకెగసిన నిరంతర కృషి
శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి నిలువెత్తు ఉదాహరణ
మొక్కవోని సంకల్పశక్తి ఆమె చిరునామా
ఆమెకు మన సంప్రదాయపు చీరలు చుట్టకండి
మసక అద్దాలు పెట్టుకొని చూడకండి

మూఢ నమ్మకాల కలుగులోకి ఆమెను లాగకండి
అజ్ఞానపు చీకట్లను దాటుకొని
అంతరిక్షంలోకి ఎగసిన నిప్పుకణిక ఆమె
కాలం గోడలపై కొత్త చరిత్ర లిఖించిన తార
మీ సంకుచిత తలపుల్ని మూసివేయండి
ఆమె వొంటి పేరు సునీత
భూమ్యాకాశాలను దిగ్విజయంగా చుట్టి వచ్చిన విజేత

ఇక లేవండి..
కులమతాల నిచ్చెన మెట్ల మీంచి ఇకనైనా లేవండి!
ఆకాశ వీధుల్లో ఆమె ఎగరేసిన విజయపతాక
ఆత్మగౌరవ పరిమళాలతో రెపరెపలాడుతోంది..
విశాల దృష్టితో చూడండి
చప్పట్లు కొట్టి ఆమెకు స్వాగతం పలుకుదాం
మన చూపుడు వేలును ఆమె వైపు సారించి
రేపటి తరాలకు మార్గం సరళం చేద్దాం!

– సునీత గంగవరపు, 9494084576

కాలం ఎడంచేతి వేలి మీద ...

అరక పట్టి మెరక దున్నే రైతులు
రాళ్ళూ రప్పల్ని పెరుకుతూ
తుప్పా డొంకల్ని నరుకుతూ
ఒళ్ళంతా గాయాలు చేసుకోవడం
నువ్వెప్పుడన్నా చూసావా?
ఇనుప ముక్కల గాజుపెంకుల
బురద గుంటలో నెత్తురోడుతూనే
ఆ నెత్తుటి జలాన్ని దోసిళ్లకెత్తుకొని
కాల్వలకు మళ్ళించడం
నువ్వెక్కడన్నా గమనించావా?

గమనించి ఉంటే ఇంత పైశాచికంగా
శంభు, ఖనౌరి సరిహద్దుల్లో
శాంతియుతంగా నిరసన తెలుపుతూ
వాళ్ళు కట్టుకున్న తాత్కాలిక శిబిరాల్ని
నిర్దాక్షిణ్యంగా బుల్డోజ్ చేసి ఉండవు!

పొద్దు పొడవకముందే నిద్రలేచి
ఆకలిగొన్న దూడకి పొదుగందించటానికి
పరుగులెత్తే తల్లియావుల్లా
రైతులు పొలానికి బయలుదేరే
అపురూప దృశ్యాన్ని నువ్వెప్పుడన్నా తిలకించావా?

పోనీ, చీకటి పడ్డాక
రెప్పల మీద వాలుతున్న
కునుకు పిట్టల్ని పారదోలుతూ
బిడ్డల్ని కాపు కాసే కన్న తండ్రుల్లా
లాంతర్లు పట్టుకొని పొలం బాట పట్టిన రైతుల్ని
నువ్వెప్పుడన్నా తిలకించావా?

తిలకించి వుంటే నీ గుండె చెరువై
వాళ్ల న్యాయమైన హక్కుల మాగ్నా కార్టా ముందు
పశ్చాత్తాపంతో మోకరిల్లి తల నేలకేసి బాదుకునే వాడివి!

నువ్వు రోజు తినే తిండి
ఏ దేశం నుంచి రప్పించుకున్నదైనా
అది రైతులు చిందించిన సేద్యపు చెమటే
అన్న నిజాన్ని గుర్తించి ఉండేవాడివి

దేశానికి అన్నం పెట్టే రైతుల్ని
ఇంత రాక్షసంగా హింసిస్తే
కాలం చూస్తూ ఊరుకోదు!
బిర్రబిగుసుకుపోయిన నీ గుండె
బంజరును దున్ని దారికి తేవడం
కొర్రుగట్టిన నీ మెదడు కుదుళ్ళలోని
ముళ్ళ పొదల్ని నరికి పోగులు పెట్టడం
కాలం ఎడంచేతి వేలు మీద
చుక్క పెట్టినంత సులభం!

– పతివాడ నాస్తిక్, 9441724167

పానకం – షీర్ ఖుర్మా

రామాయణం సాక్షిగా
సీతమ్మను అపహరించింది
నేను కాదు
ఆమె మీద
అపవాదు వేసిందీ నేను కాదు

మహాభారతంలో
ద్రౌపది చీర లాగిన
మయసభలో నేను లేను
కర్ణుడి మీదకు బాణం వేసి
ప్రాణం తీసింది నేను కాదు

ఔరంగజేబుతో బంధుత్వం లేదు
శివాజీ మహారాజ్‌కు
శత్రువును కాను

మరి
నీకూ నాకూ మధ్య
చెడిందెక్కడో చెప్పు..?

నీకు గుర్తుందా...

అర్ధరాత్రి మసీదులోకి దూరి
అల్లా కోసం వెదికే వాళ్ళం
అస్సలు కనిపించేవాడే కాదు
పూజారి లేనప్పుడు గుళ్ళోకి వెళ్లి
సీతారాములతో మాటాడేవాళ్ళం
ఎంతకూ బదులిచ్చేవారు కాదు

వినుకొండ రామలింగేశ్వర స్వామి తిరణాల్లో
కొండెక్కి సందడి చేసేవాళ్ళం
దేవరాజు గట్టు
హనీఫ్ షా ఖాద్రి ఉరుసులో
జెండాలు మోస్తూ ఊరిగేవాళ్ళం

శ్రీ రామనవమి పానకం
రంజాన్లో వండిన షీర్ ఖుర్మా
మన బాల్యానికి తీపి గురుతులు!

ఇప్పుడా పానకంలో
విషం కలుపుతుందెవరు?
షీర్ ఖుర్మా చేదెక్కింది ఎందుకు?

అరే దోస్త్...
మసీదు కింద శివలింగాలను కాదు
వాడి కుర్చీ కింద
మన మృత దేహాల్ని వెదుకుదాం పద...!

– సాబిర్ , 91547 05556

ఎవరు కవి? ఏది కవిత్వం?

'కవిత్వమొక తీరని దాహం' అని మహాకవి శ్రీశ్రీ అంటే, కవిత్వమొక ఆల్కెమీ అని తిలక్ అన్నారు. 'కవిత్వమొక ప్రసవ వేదన' అని మరో కవి అనుండొచ్చు. ఇలా కవిత్వం గూర్చి ఎవరు ఎలాగైనా నిర్వచించుకోవచ్చు. కవిత్వమనేది ఒక సృజన సాహిత్య ప్రక్రియ. మిగతా ప్రక్రియల కంటే భిన్నమైనది. సాహితీ జగత్తులో శిఖరాగ్రాన నిలిచే ప్రక్రియ. అటువంటి అగ్రగామి కవిత్వం పురుడు పోసుకొని మహోజ్వలంగా విరబూయాలంటే కవి యొక్క మానసిక లోకంలో తీవ్ర సంఘర్షణ జరగాల్సిందే.

కవిత్వం అందరికీ అబ్బదు. అలాగని కవిత్వానికి వర్గభేదమూ లేదు. ఎవరినైనా వరిస్తుంది. ఐతే కవిత్వం నేర్చుకోవాలని ప్రయత్నిస్తే రాదు. స్వతహాగా ఊహాశక్తి కలిగి ఉండాలి. ఊహాశక్తి ఉన్నంత మాత్రాన సృష్టించలేరు. ఆ ఊహాశక్తితో ఏ వస్తువునైనా బొమ్మ కట్టించే నైపుణ్యం ఉండాలి. పాఠకుని కళ్ళముందర ఆ బొమ్మను తిరుగాడేలా చేయగలగాలి. దీనికి వస్తువు, భాష, అభివ్యక్తి, సామాజిక స్పృహ, ప్రాపంచిక దృక్పథం అవసరం. అప్పుడే ఆ కవిత్వం పూర్తి ప్రామాణికతను సంతరించుకొని, ప్రజాదరణను పొందగలదు. అలాంటి ప్రామాణిక కవిత్వాన్ని నిర్మించాలంటే కవి ప్రతిభావంతుడు అవ్వాలి. నిరంతర సమగ్ర అధ్యయనశీలి కావాలి. సమగ్ర అధ్యయనం అంటే కేవలం పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, సమాజాన్ని కూడా చదవాలి. అంటే సుదీర్ఘ కాలం పాటు సామాజిక భాగస్వామి కావాలన్నమాట.

ఓ పండితుడు కేవలం శబ్దాలంకారాలతో అక్షరాలను, పదాలను పేర్చుకుంటూ పోతే, అది కవిత్వమైపోదు. కవిత్వమనేది ఒక అందమైన భావప్రకంపనల పరంపర. ఆ ప్రకంపనలనేవి ఆ కవి పలవరించిన, పరిశీలించిన లేదా అనుభవించిన సుఖాల్లోంచి, దుఃఖాల్లోంచి, సంక్షోభాల్లోంచి, వేదనల్లోంచి ఇలా ఏదో ఒక ప్రేరణల్లోంచి పుట్టుకొస్తాయి. అంటే సానుభూతి, సహానుభూతి, స్వీయానుభూతి ... ఇలా ఏ భావవైచిత్రి నుంచైనా కవితా వస్తువుని ఎంపిక చేసుకోవచ్చు. అప్పుడే ఒక విశిష్టమైన కవితా వాక్యానికి రూపకల్పన జరుగుతుంది. ఐతే ఈ నేపథ్యంలో రాయబడిన కవిత్వం ఉత్త కవిత్వమా? ఉత్తమ కవిత్వమా? అని కూడా తీర్మానించుకోవల్సిన అవసరముంటుంది.



సకల ప్రపంచమంతా మంచుతెరలు కమ్ముకున్న వేళ ఉషోదయ కిరణాల తాకిడితో ఆ తెరలు ఎలా కరిగిపోతాయో! అలా ఓ కవిత్వం చదవగానే, పఠితుని మనస్సులో అంతవరకూ అలుముకున్న అస్పష్టత, మౌఢ్యం చెరిగిపోవాలి. దానినే ఉత్తమోత్తమ కవిత్వమనవచ్చు. అయితే ఉత్త కవిత్వం రాసినవాడు కవా, ఉత్తమ కవిత్వం రాసిన వాడు కవా? లేక ఇద్దరూ కవులేనా? ఈ విషయం తేల్చుకోవాల్సి వస్తే, ఉత్తమ కవిత్వం రాసిన వాడినే కవి అని చెప్పాలి. ఎందుకంటే, కవిత్వమనేది సామాజిక ప్రయోజనానికి బలమైన పునాది కావాలి. కవిత్వమనేది ప్రజా సంక్షేమానికి ఇతోధికంగా ఉపయోగపడాలి. చైతన్యవంతమైన సమాజ రూపకల్పనకు ఏదో ఒకరకంగా దోహదపడాలి. ఈ లక్షణాలు ఉత్తమ కవితలోనే ఉంటాయి గనుక, ఎటువంటి రెండవ అభిప్రాయం లేకుండానే ఉత్తమ కవిత్వాన్ని రాసినవాడినే కవి అని నిర్ధారించవచ్చు. కానీ కొంతమంది మాత్రం పాఠకుల్లో రసానుభూతిని కలిగించేదే కవిత్వమంటారు. వెను వెంటనే ఇది నిజమా? అనే ప్రశ్న తప్పక ఉదయిస్తుంది. కవిత్వం కేవలం వినోద ప్రధానంగానే సాగకూడదు. అది కేవలం రసానందానికే పరిమితం కాకూడదు. సరదాకి, కాలక్షేపానికి రాసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకప్పటిలా నేడు సుకవి అనలేం. కాలానుగుణంగా అనేక విషయాల్లో మార్పులు సంభవించినట్లే, 'సుకవి–కవి– కుకవి' అనే వాటికి కచ్చితంగా నిర్వచనాలు మారుతాయి.

ఎవరైనా ఏదైనా ఒక సాహితీ ప్రక్రియకు సంబంధించిన పుస్తకాలను ఎక్కువగా చదివితే, వారికి ఆ సాహితీ ప్రక్రియలో రాయడానికి కొంతశక్తి దొరుకుతుంది. అదే వ్యక్తి ఎన్ని కవితా సంపుటులను చదివినా కవిత్వ సృజన చేయలేడు. ఎందుకంటే కవితా సజన విరివిగా చదివినంత మాత్రాన పట్టుబడదు. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అనేవి కవికుండాల్సిన ప్రాథమిక లక్షణాలు. వీటితోపాటు సామాజిక చేతన, విశ్వశ్రేయోదృష్టి అనేవి నేటి కవికి ఉండవల్సిన నవీన లక్షణాలు. ఆయా లక్షణాలు గల వ్యక్తి గొప్ప ప్రయత్నం చేయగలిగితేనే ఓ కవిగా స్థిరపడగలడేమో! అంటే ఒక వ్యక్తి ఎంతో కృషి, పట్టుదల, తపనతో నిరంతర సాధన చేస్తేగాని కవిత్వం పట్టుబడదు.

కవిని క్షేత్రస్థాయిలో మనం అనేక భౌతిక రూపాల్లో చూడవచ్చు. అనేక వృత్తి ధర్మాలను నిర్వహించే మానవ రూపాల్లో ఊహించుకోవచ్చు. సమాజంలో ఉన్న వ్యక్తులచే పిలువబడే అధిక, అంత్య మానవ రూపాల్లో దేనిలోనైనా చూడొచ్చు. అది ఒక సంఘసంస్కర్త గానైనా కావచ్చు లేదా ఒక పారిశుద్ధ్య కార్మికుని గానైనా కావచ్చు. ఒక స్త్రీమూర్తి తన ఆనందమయ జీవితం కోసం, తన కుటుంబానికి సంతోష సమయాలను కానుకగా ఇచ్చేందుకుగాను గర్భం దాల్చి, ఎంతో ఓర్పుతో తొమ్మిది నెలలు మోసి, చివరికి పంటిబిగువున ప్రసవవేదన భరిస్తూ ఓ బిడ్డకు జన్మనిస్తుంది. అదేవిధంగా కవి కూడా ఒక మాతృమూర్తి లాగానే అనేక పరితాపముల నడుమ తన మనోవల్మీకం నుంచి సంగ్రహించిన భావనలతో కొత్త కొత్త కవితా వాక్యాలను అల్లుతూ, సాహితీ సృజన చేస్తుంటాడు. అందుకే కవిని అమ్మతో పోల్చడం సరైనది. ఒక రైతు నారు పోసి, నీరు మోసి, ఇంకా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పంటను అనుక్షణం కాపాడుకుంటూ చివరకు బంగారు పంటలను పండిస్తూ దిగుబడి ఫలాలను పొందుతాడు. అలాగే కవి కూడా ఓ సైరికుడు వలె అనేక ఘర్షణల నడుమ కవితా సేద్యం చేస్తుంటాడు. చివరికి ఫలవంతమైన పంటలా సామాజిక ప్రయోజనాన్ని అందుకుంటాడు. అందుకే కవిని రైతుతో పోల్చడం జరిగింది. ఒక యోధుడు తన ప్రాణాలను సైతం లెక్కచేయక రాత్రనకా పగలనకా సరిహద్దుల్లో పహారా కాస్తూ తన దేశ ప్రజలను శత్రువుల బారినుంచి కాపాడుతుంటాడు. అలాగే ఓ కవి కూడా ఓ రక్షకుడే. సమాజంలో పేరుకుపోతున్న అవినీతిని, అక్రమాల్ని బట్టబయలు చేసి జనాన్ని చైతన్యవంతం చేస్తూ తద్వారా ఆధిపత్య వర్గాలపై, రాజ్యం ఆగడాలపై తిరుగుబాటు చేయిస్తాడు. అందువల్లనే కవిని కవనయోధుడు అంటారు.

ఒక ఫంక్షన్‌లో విందు భోజనం చేసేటప్పుడు ఒక్కొక్కరు ఒక్కో విధంగా తింటారు. ఆ ఆహారంలో ఉన్న రుచిని బట్టి కొంతమంది మితంగా, ఇంకొంతమంది అమితంగా తీసుకుంటారు. ఈ భేదం వారు అరిగించుకునే శక్తిని బట్టి కూడా ఉంటుంది. అలాగే కవిత్వం లోతుపాతులను అర్థం చేసుకోవాలంటే పాఠకునికి ఉన్న జ్ఞానం, అవగాహన బట్టి ఉంటుంది. అందుకే కవి పాఠకుని విజ్ఞాన స్థాయి దగ్గరకు వెళ్లే కవిత్వాన్ని రాయాలి. అప్పుడే అది సార్థకమైన కవిత్వమౌతుంది.

కవి వర్తమాన సామాజిక, రాజకీయ అంశాలను ఆకళింపు చేసుకోవాలి. వాటిపై తనదైన దృష్టి కోణం కలిగియుండాలి. సాంఘిక రాజకీయ అంశాలను ప్రతిబింబిస్తూ రాసే కవిత్వంపై రాజ్యం నిఘా ఎల్లప్పుడూ ఉంటుంది. అలాంటి కవులపై పలు రకాలుగా దాడులు జరగవచ్చు. వాటన్నింటికీ ఎదురొడ్డి నిలిచే ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం కవనయోధుడికి ఉండాల్సిందే. కవులేం చేస్తారని ప్రశ్నించి, ఏం చేస్తారో తానే ఇలా వివరంగా చెప్పారు కవి శివారెడ్డి. "కవులేం జేస్తారు/ గోడలకు నోరిస్తారు/ చెట్లకు కళ్లిస్తారు/ గాలికి గొంతిస్తారు/ ప్రభుత్వాన్ని ధిక్కరిస్తారు/ ప్రజలకు చేతులు ఇస్తారు". ఇలా చేయటమే కవి కర్తవ్యం. ఇలా చేయగలిగితేనే కవిత్వానికి పరమార్థం.

– పిల్లా తిరుపతిరావు
70951 84846

అలరించిన 'సురభి' నాటకోత్సవం



రంగస్థలంపై రథం.. 'సురభి' ఆవిష్కారం

భారతదేశ, ప్రత్యేకించి తెలుగు నాటకరంగం గర్వించే సంస్థ 'సురభి'. పాశ్చాత్యీకరణ, ఆధునీకరణ ఇత్యాది కారణాలతో ప్రాభవం కోల్పోతున్న దశలో – సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, తంజావూరు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా సురభి మహోత్సవాన్ని తలపెట్టడం ముదావహం, సురభికి 141వ ఏడాది వస్తున్న సందర్భంగా ఈనెల 15 – 20 తేదీల్లో విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల ఆవరణలో రోజుకొకటి చొప్పున ఆరు నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. సురభి ప్రదర్శన అంటేనే ఒక ప్రత్యేకం, అద్భుతం! నారదుడు దివి నుంచి భువికి దిగడం.. స్టేజీపై రథం, యుద్ధ విన్యాసాలు.. కంసుడు బాలికను పైకెగరేస్తే అక్కడే ఆగి హెచ్చరించడం.. కాటేయడానికొచ్చిన పామును గరుడ పక్షి తన్నుకెళ్లిపోవడం... సముద్రంలో మునిగిపోతున్న ప్రహ్లాదుణ్ణి విష్ణుమూర్తి పైకి తీసుకురావడం... తాపసి చుట్టూ పుట్ట క్రమంగా పెరగడం... వంటి ప్రేక్షకుల్ని తన్మయుల్ని చేసే వైర్ వర్క్ విన్యాసాలు సురభికే సాధ్యం. మిరుమిట్లు గొలిపే లైటింగ్‌లో జిగేలు జిగేలుమనే పాత్రోచిత డ్రస్సులు, ఆభరణాలు సురభి ప్రదర్శనల్లోనే తనివితీరా, కనులారా కాంచగలం. లైట్స్ ఆఫ్ అండ్ ఆన్ గ్యాప్ అతి కొద్ది సెకన్లు మాత్రమే! దాదాపు ప్రతి నాటకంలో 40 – 50 మంది పాత్రధారులు, అందులో సగానికి తగ్గకుండా స్త్రీలు ఉండడం సురభికే చెల్లు. పసి గుడ్డు నుంచి పండు ముసలి వరకూ ఆయా పాత్రల్లో పాల్గొంటారు.

ఇలా పలు ప్రశంసనీయ అంశాలతో పాటు ఒకటి రెండు ఇతర అంశాలను కూడా ప్రస్తావించాలి. ఏడెనిమిది తరాల అనంతరం చాలా మంది సురభి కళాకారుల వాచకం, అభినయం, గాన మాధుర్యం ఇంకా మెరుగు పడాలని చెప్పాల్సి రావడం నిష్ఠుర సత్యం. పోర్షన్ గుర్తురాక కొన్ని క్షణాలు ఆగిపోవడం, పక్క నుంచి అందించడం.. ఒకరి డైలాగ్ పూర్తవ్వకుండానే వేరొకరు డైలాగ్ ఎక్కేయడం.. ఇత్యాది లోపాలను సరిజేసుకోవడం సురభి కీర్తిని మసకబార్చకుండా చేస్తుంది. వాస్తవానికి సురభిలో ప్రజ్ఞావంతులకు కొదవ లేదు. అవేటి పూర్ణిమలూ, గూడూరు సావిత్రిలూ, జమునా రాయలులూ, మనోహర్రావులూ, పద్మశ్రీ బాబ్జీలూ వెంటనే స్ఫురిస్తారు. ప్రస్తుత సమాజాల్లోనూ మంచి కళాకారులు లేకపోలేదు. అదే సందర్భంలో– సురభి కుటుంబాలకు చెంది, వేరే సమాజాల నాటకాల్లో అద్భుతంగా రాణిస్తున్న ప్రభావతులనూ లలితలనూ ఈ సమాజాలు ఇముడ్చుకోలేకపోతున్నాయో, వారే ఇమడలేకపోతున్నారో..!

ఇంత భారీ నెట్ వర్క్‌తో ప్రదర్శనలిస్తున్న సురభి ఇప్పటికీ పౌరాణిక (ఒకటీ అరా జానపద) నాటకాలకే పరిమితమవుతోంది. జన జాగృతికి దోహదపడే ఎన్నో సాంఘిక ఇతివృత్తాల్ని తయారుజేసుకుని జనరంజకంగా ప్రదర్శనలివ్వొచ్చు. సురభి ఈ కోణంలో కూడా దృష్టి సారించాలని నాటకాభిమానుల ఆకాంక్ష. వాస్తవానికి సురభి గతంలో ఒకటీ అరా సాంఘిక నాటకాలు ఆడకపోలేదు. అయితే చాలా కాలంగా ఆ ఊసే లేదు. ఇప్పుడు ప్రదర్శిస్తున్న ఇతివృత్తాలు దాదాపుగా అందరికీ తెలిసినవే అయినందున.. కథాపరంగా ముమ్మిందే జరగబోతుందోనని ప్రత్యేక ఆసక్తీ ఉత్సుకతా ఉండవు. అయినా ప్రేక్షకులు రోజూ అధిక సంఖ్యలో విచ్చేయడం సురభి పట్ల ప్రేక్షకుల క్రేజ్... గ్లామర్‌కు నిదర్శనం.

ప్రదర్శనల పరామర్శ

నాటకోత్సవం మొదటి రోజు శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ (హైదరాబాద్), శ్రీ విజయ భారతీ నాట్యమండలి (నార్కట్ పల్లి) వారు 'భక్త ప్రహ్లాద' ప్రదర్శించారు. హిరణ్యకశిపుడు పాత్రధారి సురభి జయచంద్రవర్మ దర్శకత్వం వహించారు. రచన : కే.శే.ధర్మవరపు కృష్ణమాచార్యులు. బుల్లి ప్రహ్లాదుడు నూటరెండు జ్వరంతో స్టేజీ ఎక్కడం ఆ సమాజాల కమిట్మెంట్‌కు తార్కాణం. ప్రధాన ప్రహ్లాదుడి అభినయం, గానం బాగున్నాయి. రెండో రోజు 'లవకుశ' నాటకాన్ని శ్రీ భానోదయ నాట్యమండలి (వరంగల్), శ్రీ శారదా నాట్యమండలి (నార్కట్ పల్లి) వారు ప్రదర్శించారు. రచన : మల్లాది వేంకట కృష్ణ శర్మ. దర్శకత్వం : ఆర్.నాగబాబు (శ్రీరామ పాత్రధారి). శ్రీరామ పట్టాభిషేకంతో నాటకం ప్రారంభమై.. లవకుశులకు పట్టాభిషేకం, అనంతరం శ్రీరాముడి అవతార సమాప్తితో ముగుస్తుంది. ఉన్నంతలో లక్ష్మణ పాత్రధారి పద్య గానం కొంత బెటర్. లవ కుశులు ఓకే.


మూడో రోజు వి.ఉమాశంకర్, అవేటి మనోహర్ సమాజాలు 'యాదాద్రి మహోద్భవం' నాటకాన్ని ప్రదర్శించాయి. రచన, దర్శకత్వం : సురభి రఘునాథ్ (మేకప్). దాదాపు మూడో వంతు నాటకం భక్త ప్రహ్లాదే. వైర్ వర్క్ విన్యాసాలు అంత ప్రభావవంతంగా కుదరలేదు. నాలుగో రోజు సురభి డ్రామా థియేటర్, శ్రీ బాలాజీ సురభి థియేటర్ వారు 'శ్రీకృష్ణలీలలు' ప్రదర్శించారు. రచన : పండిట్ కె.సుబ్రహ్మణ్య శాస్త్రి. దర్శకత్వం : సురభి ఎం.నాగరాజు. క్లైమాక్స్– కంసవధ ఘటనను అసలేమాత్రం ఎస్టాబ్లిష్ చేయకుండానే 'మమ' అనిపించారు. తర్వాత డైలాగ్స్‌ను బట్టి అర్థమైంది కంసుడ్ని కృష్ణుడు సంహరించాడు అని. మహిళలు ఎక్కువమంది పాల్గొన్న సన్నివేశాల్లో కాస్త గడబిడ అనిపించి.. డైలాగులు సరిగా అర్థం కాలేదు.

ఐదో రోజు శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి, శ్రీ శారదా కళా మనో వినోదిని వారు 'జై పాతాళ భైరవి' ప్రదర్శించారు. దర్శకత్వం : ఆర్.చిన్న వెంకట్రావు. ప్రదర్శన నీట్‌గా, హాయిగా సాగింది. వైర్ వర్క్ విన్యాసాలు చాలా వరకు సింక్రనైజై అలరించాయి. అలనాటి ఎన్టీఆర్, ఎస్వీఆర్ తదితర అగ్ర తారాగణం సూపర్ డూపర్ హిట్ సినిమాయే ఈ నాటకం. తోట రాముడు (హీరో), రాజు, రాజకుమారి, రాజు బావమరిది ఓకే. నేపాళ మాంత్రికుడు సూపర్. ఆఖరి రోజు సురభి ఆర్ట్స్ అసోసియేషన్, సురభిళ నాట్య కళా మండలి వారు 'మాయాబజార్' ప్రదర్శించారు. రచన : మల్లాది వేంకట కృష్ణ శాస్త్రి. దర్శకత్వం: సురభి ప్రసాద్. చిన్న చిన్న మినహాయింపులున్నా మొత్తంగా చూసుకున్నప్పుడు నాటకం అలరించింది. ప్రధాన పాత్రధారులందరూ బాగానే చేశారు. వైర్ వర్క్ ట్రిక్స్ కూడా చాలావరకు వర్కవుటయ్యాయి. గతంలో తెలిసినదానికి భిన్నంగా ఈ కథలో బలరాముడు, శ్రీ కృష్ణుడు మధ్య ప్రత్యక్ష వాగ్వాదం గమనిస్తాం.

మొత్తంగా చూసుకున్నప్పుడు సురభి నాటకోత్సవం విజయవంతమైనట్టే! పండిత, పామరులతో పాటు సద్విమర్శకుల్ని అన్ని విధాలా మెప్పించేంతగా.. ఆధునిక నాటక రంగ తీరుకూ మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా సురభి తనను తాను స్థిరంగా వృద్ధి చేసుకోవాలి. ప్రభుత్వాలు కూడా సురభిని ఆదుకునేందుకు సదా సిద్ధంగా ఉండాలి. ఈ ఆర్రోజుల సురభి నాటకోత్సవాన్ని ఎస్.జడ్.సి.సి.నుంచి పురాణం మాధవి (సురభి రిసెర్చర్) సమన్వయపరిచారు.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్
9912615747

కళ్లకు కట్టే తెలుగు నాటక రంగ చరిత్ర



'చరిత్ర తెలియని వాడు చరిత్ర హీనుడవుతాడు' అన్నది లోకోక్తి. తాను బతుకుతున్న సమాజంలోని సమకాలీన చరిత్రను గ్రంథస్థం చేయనివాడు రచయిత కాగలడా? ఊహాజనిత రచనలు ఎన్ని చేసినా, వాస్తవ చరిత్రను అక్షరీకరించి, యథార్థ ఘటనలను భవిష్యత్తు తరాలకు తరగని సాహిత్య సంపదగా అందించాల్సిన నైతిక బాధ్యత లక్షర హాలికులుది కాదా? తన చదువుకు వృత్తికి, ప్రవృత్తికి సరైన న్యాయం చేస్తూ కలాన్ని కదిలించాల్సిన బాధ్యత రచయితపై లేదా? ఈ ప్రశ్నలన్నింటికీ ఎవరి సమాధానం ఏదైనా ... డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, వాడ్రేవు సుందర్రావు మాత్రం నాటకరంగంపై తమకున్న అమిత ప్రేమలో అందించిన పుస్తక రాజమే 'తెలుగు నాటకరంగ మూల స్తంభాలు'. నాటక రంగానికి విశేష సేవలందించిన రచయితలు, నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన సమగ్ర చరిత్రను తెలుగు సాహిత్యానికీ అందించిన ఘనత వీరిరువురిదీ.

అసలు ఈ పుస్తకంలో ఏం ఉంది? అన్న ప్రశ్నే లేదు... ఏం లేదు? అన్న రంధ్రాన్వేషణ కూడా అక్కర్లేదు. విస్తృత సమాచారంతో వివరంగా రాసిన తెలుగు నాటకరంగ సమగ్ర చరిత్ర ఈ పుస్తకం. ఈ ఒక్క పుస్తకం చాలు తెలుగు నాటక సమాజం గురించి ఎంతో తెలుసుకోవొచ్చు. తొలి తెలుగు నాటక రచయిత ఎవరు? ఆయన రచనలు ఏవి? నాటకం ప్రధాన రూపాలు ఏవి? వెండి, బంగారం అనే నూతన పద్య రీతుల్ని, ఛందస్సుని రూపొందించింది ఎవరు? తెలుగు నాటక తొలి ప్రయోక్త ఎవరు? నాటకాల వర్గీకరణ ఎన్ని రకాలు? తెలుగు నాటకానికి తొలి ప్రదర్శన ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఏర్పాటు చేశారు? తొలి సాంఘిక నాటక రచయిత ఎవరు? భవభూతి మహాకవి రచించిన 'సంస్కృతోత్తర రామ చరిత్ర'కు ఆంధ్రీకరణ ఎవరు చేశారు? 'మృచ్ఛకటిక' నాటికను తెలుగు చేసి తెలుగు వారికి అందించింది ఎవరు? గుంటూరు హిందూ నాటక సమాజ స్థాపకులు ఎవరు? ఇలాంటి వందలాది ప్రశ్నలకు ఆసక్తికరమైన జవాబులనిచ్చే పుస్తకం ఇది. వెయ్యి పేజీలకు పైగా ఉన్న పరివర్ధిత ప్రతిలో మొత్తం 266 వ్యాసాలు నిక్షిప్తమై ఉన్నాయి.

ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్‌ని 1992లోనే సాధించి, 1970 నుంచే సుమారుగా ఐదున్న దశాబ్దాల నాటక రంగం అనుభవంలో డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు రచయితలపై 86, నటులు, దర్శకులపై 76 సాంకేతిక నిపుణుల సమాచారం, పరిశోధకుల వివరాలు, ఇతర ప్రక్రియలకు సంబంధించి మొత్తంగా 181 వ్యాసాలను పరిశోధించి అపారమైన జ్ఞాన సంపదను, అందించారు. తెలుగు భాషాపరంగా అత్యున్నత స్థాయిని పుస్తకంలో నిక్షిప్త పరిచారు. వృత్తిరీత్యా కామర్స్ లెక్చరర్‌గా జీవితం కొనసాగినప్పటికీ, నాటక రంగంపై ప్రేమతో మిగిలిన వ్యాసాలు మొత్తం వాడేవు సుందరరావు అందించారు.

తెలుగు నాటక రంగం చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకునే ఈ ప్రతిలోని ప్రతి వ్యాసమూ అమూల్యమే! అందువల్ల 1200 రూపాయల వెల అత్యంత తక్కువే అనుకోవొచ్చు. తెలుగు నాటకరంగ చరిత్రను అత్యద్భుతంగా అందించిన రచయితలందరూ తమ వృత్తికి, ప్రవృత్తికి సంపూర్ణ న్యాయం చేశారు. ఈ రచయితలు ఇద్దరూ అత్యధికకాలం అధ్యాపక వృత్తిలోనే ఉండడం గమనార్హం. అధిక శాతం ఉపాధ్యాయ నేపథ్యంలో ఉండటం వెనుక, బహుశా నిత్యం పిల్లల మధ్య ఉన్నందున ప్రవర్ధనముంగా ఎదిగే బిడ్డల మధ్య పొందే మానసిక ప్రశాంతత కారణం కావచ్చు. ఈ రచయితలిద్దరూ బహుభాషా ప్రవీణ్యం కలవారు. వివిధ భాషల సాహిత్యాన్ని అనువాదం చేసినవారు. తెలుగు నాటక రంగానికి సంబంధించిన 266 మందిలో కేవలం తెలంగాణ తొలి నాటక రచయిత, తూము రామదాసు ఫొటో మినహా మిగిలిన వారందరివే అద్భుత చిత్ర రాజాలే! వీటితో పాటు సందర్భోచితంగా ముద్రించిన అనేక మంది ఫొటోలతో కూడిన ఈ మహా గ్రంథం ప్రతి ఒక్కరి ఇంట్లోనూ, వివిధ సంస్థల గ్రంథాలయాల్లోనూ ఖచ్చితంగా ఉండాలి. ఆయా నాటకరంగ ప్రముఖుల స్వీయ సంతకాల సేకరణ గొప్ప ఆలోచన, పాఠకులకు ప్రత్యేక కానుక కూడా! మూడు సంవత్సరాల పాటు రచయితలు చేసిన అద్భుత కృషి అత్యంత అభినందనీయం. కాగా, ఆది నుంచే పంటి కింద రాళ్ళలాగ తగిలిన అక్షర దోషాలను తృతీయ ముద్రణలో తొలగించడం అత్యంత ఆవశ్యకం.

(మార్చి 27 : ప్రపంచ రంగస్థల దినోత్సవం)

– డాక్టర్ దుట్టా శమంతకమణి
94919 62638

ప్రజాశక్తి
www.prajasakti.com

అన్ని వేళ్లూ జస్టిస్ వర్మ వైపే!

జడ్జి నివాసం సమీపంలో కాలిన నోట్లు
నిర్ధారించిన పారిశుధ్య కార్మికులు
గదిలో నాలుగైదు బస్తాల్లో నగదు
బయటపెట్టిన సుప్రీంకోర్టు నివేదిక
లోతైన దర్యాప్తు కోసం త్రిసభ్య కమిటీ నియామకం

న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన నివాసం సమీపంలో కాలిపోయిన కరెన్సీ నోట్లు కన్పించడం కలకలం రేపింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు ఇంద్రజిత్ చెత్తను సేకరిస్తుండగా కాలిపోయిన ఐదు వందల రూపాయల నోట్ల ముక్కలు కన్పించాయి. కొద్ది రోజుల క్రితం కూడా ఇంద్రజిత్‌కు ఇలాగే నోట్ల ముక్కలు కన్పించాయి కానీ అగ్నిప్రమాదం ఎలా జరిగిందో ఆయనకు తెలియలేదు. 'ఈ సర్కిల్‌లోనే మేము పనిచేస్తుంటాం. రోడ్ల మీద ఉన్న చెత్తను సేకరిస్తాం. నాలుగైదు రోజుల క్రితం ఇక్కడ శుభ్రం చేశాం. కాలిపోయిన ఐదు వందల రూపాయల నోట్ల ముక్కలు కొన్ని కన్పించాయి. ఇప్పుడు కూడా ఒకటి రెండు ముక్కలను గమనించాం. అగ్నిప్రమాదం ఎక్కడ జరిగిందో మాకు తెలియదు. మా పని అంతా చెత్తను 'సేకరించడమే' అని ఇంద్రజిత్ తెలిపారు. మరో పారిశుధ్య కార్మికుడు సురేందర్ కూడా దీనిని ధ్రువీకరించారు. 'చెత్తను సేకరించే వాహనాలలో నింపుతాం. నాలుగైదు రోజుల క్రితం కాలిపోయిన ఐదు వందల రూపాయల నోట్ల ముక్కలు కన్పించాయి. ఇప్పుడు కూడా కొన్ని దొరికాయి' అని ఆయన చెప్పారు.

బస్తాల్లో కరెన్సీ నోట్లు

ఇదిలావుండగా సుప్రీంకోర్టు విడుదల చేసిన నివేదిక ప్రకారం స్టోర్‌రూమ్‌గా ఉపయోగిస్తున్న ఔట్‌హౌస్‌లో కాలిపోయిన నాలుగైదు బస్తాల కరెన్సీ నోట్లు లభించాయి. జడ్జి నివాసంలోకి ఆ డబ్బు ఎలా వచ్చిందన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీంకోర్టు జరిపిన విచారణ నివేదికను శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత బహిర్గతం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిన తర్వాత అగ్నిమాపక సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కూడా ఆ నివేదికతో పాటే విడుదల చేశారు. స్టోర్‌రూమ్‌లోకి బయటి వ్యక్తులు ప్రవేశించినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ సూచనప్రాయంగా చెప్పారు. దీనిని బట్టి జస్టిస్ వర్మకు సంబంధించిన వారే ఆ గదిలోకి వెళ్లారని అర్థమవుతోంది. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు, నివేదిక నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. అసలు ఆ నగదు ఎక్కడిది, జస్టిస్ వర్మ సిబ్బందికి



జస్టిస్ వర్మ, జడ్జి నివాసం సమీపంలో కాలిన నోట్లు

కానీ లేదా ఇతరులకు కానీ ఈ వ్యవహారంలో ఏమైనా ప్రమేయం ఉన్నదా అనే విషయాన్ని ఈ కమిటీ దర్యాప్తు జరుపుతుంది. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ న్యాయపరమైన విధులు నిర్వర్తించవద్దని జస్టిస్ వర్మకు ఆదేశాలు జారీ చేశారు.

జవాబు లేని ప్రశ్నలెన్నో

ఈ నెల 14వ తేదీ రాత్రి జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. వారం రోజుల తర్వాత కానీ ఈ ఘటన వెలుగులోకి రాలేదు. ఈ మధ్యకాలంలో ఏం జరిగిందన్న దానిపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వీటికి నేటివరకూ సంతృప్తికరమైన సమాధానం లభించలేదు. జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమాచారాన్ని ఆయన ప్రైవేటు కార్యదర్శి ఆ రోజు రాత్రి 11.43 గంటలకు అధికారులకు చేరవేశారు. రెండు అగ్నిమాపక శకటాలు అక్కడికి చేరుకున్నాయి. నివాస ప్రాంగణం సరిహద్దు గోడకు ఆనుకొని ఉన్న ఔట్‌హౌస్‌లో ప్రమాదం జరిగిందని సిబ్బంది గుర్తించారు. మంటలను వెంటనే అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. మంటలను అదుపు చేసిన తర్వాత సగం కాలిపోయిన నాలుగైదు గోనె సంచులు కన్పించాయి. వాటిలో కరెన్సీ నోట్లు ఉన్నాయి.

ఆ రోజు జస్టిస్ వర్మ, ఆయన భార్య భోపాల్‌లో ఉన్నారు. ఆయన తల్లి, కుమార్తె, సిబ్బంది మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఆ మర్నాడు... అంటే 15వ తేదీ కొన్ని శిథిలాలను, సగం కాలిన వస్తువులను గది నుండి తొలగించారు. సాయంత్రం నాలుగు గంటలకు జస్టిస్ వర్మ దంపతులు ఢిల్లీ చేరుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా లక్నోలో ఉన్న ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయకు తెలియజేశారు. ఆయన ఆ సమాచారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నాకు తెలిపారు. ఆ రాత్రి 9.10 గంటలకు ఢిల్లీ ప్రధాన న్యాయమూర్తి రిజిస్ట్రార్ – కార్యదర్శి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆయన ఆ గదిని సుమారు పది నిమిషాల పాటు పరిశీలించారు. ఇంట్లో పనికిరాని వస్తువులను ఆ గదిలో పడేస్తామని, దానికి తాళం ఉండదని, ఎవరైనా అందులోకి వెళ్లవచ్చునని జస్టిస్ వర్మ ప్రైవేటు కార్యదర్శి ఆయనకు చెప్పారు.

16వ తేదీ సాయంత్రం ఢిల్లీ సిజె ఉపాధ్యాయ లక్నో నుండి నగరానికి చేరుకొని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్ ఖన్నా నివాసానికి వెళ్లారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన సిజె ఉపాధ్యాయ రిజిస్ట్రార్ – కార్యదర్శి ఓ నివేదికను అందజేశారు. సగం కాలిన వస్తువులు అక్కడ పడి ఉన్నాయని, పూర్తిగా తగలబడిపోయిన వస్తువులు, వాటి తాలూకు శిథిలాలు నేలపై ఉన్నాయని తెలిపారు. శిథిలాలను, సగం కాలిన వస్తువులను గది నుండి తొలగించారని జస్టిస్ వర్మ నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్న గార్డు పోలీసులకు చెప్పారు. 17వ తేదీన సిజె ఉపాధ్యాయ జస్టిస్ వర్మను కలిశారు. స్టోర్‌రూములో లభించిన నగదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆయనకు చూపించారు. ఇదంతా ఓ కుట్ర అని జస్టిస్ వర్మ అనుమానాలు వ్యక్తం చేశారు. 20వ తేదీన ప్రమాదానికి సంబంధించిన మూడు ఫొటోలు, ఒక వీడియో, రెండు సందేశాలను సిజె ఉపాధ్యాయ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపారు.

ఆ నగదుతో నాకు సంబంధం లేదు : జస్టిస్ వర్మ

దీనిపై జస్టిస్ యశ్వంత్ వర్మ శనివారం స్పందించారు. తాను కానీ, కుటుంబ సభ్యులు కానీ స్టోర్‌రూములో నగదు ఉంచలేదని, ఆ నగదుతో తనకు సంబంధం లేదని తెలిపారు. కాలిపోయిన నగదును ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. తన కుటుంబ సభ్యులు ఎన్నడూ డబ్బు ఉన్న గోనె సంచులు చూడలేదని కూడా తెలిపారు. తనను ఇరికించి, అప్రతిష్టపాలు చేయడానికి చేసిన కుట్రగా స్పష్టంగా కనిపిస్తోందని, ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తనపై ఆరోపణలు ప్రసారం చేసేముందు మీడియా కొంత విచారణ చేపట్టి ఉండాల్సిందని వివరించారు. సిజెఐ తనను అడిగిన సమాచారాన్ని (సిబ్బంది వివరాలు, కాల్స్ సమాచారం) ఢిల్లీ హైకోర్టు సిజె డికె ఉపాధ్యాయకు అందజేశారు. ఆ వివరాలు సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పోస్టయ్యాయి.

జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపాలన్న ప్రతిపాదన గురించి సిజెఐ సంజీవ్ ఖన్నా హైకోర్టు సిజె ఉపాధ్యాయకు తెలియజేశారు. ఇందుకు జస్టిస్ ఉపాధ్యాయ అంగీకారం తెలిపారు. ఈ ఘటనపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉన్నదని పేర్కొంటూ ఈ నెల 21న ఉపాధ్యాయ ఓ నివేదికను అందజేశారు. ఈ వ్యవహారంపై జస్టిస్ వర్మ స్పందన ఏమిటో తెలుసుకోవాలని ఉపాధ్యాయను సిజెఐ ఖన్నా కోరారు. గదిలో అంత సొమ్ము ఎక్కడిది, అది ఎవరి నుండి వచ్చింది, కాలిపోయిన నగదును 15వ తేదీ ఉదయం గది నుండి తొలగించింది ఎవరు అనే దానిపై వివరణ కోరాలని కూడా అడిగారు. గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ ఉపయోగించిన వేరే ఫోన్ నెంబర్ల నుండి చేసిన కాల్స్ వివరాల కోసం మొబైల్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించాలని కూడా ఆదేశించారు. జస్టిస్ వర్మ నివాసంలో పనిచేస్తున్న అధికారిక సిబ్బంది, వ్యక్తిగత భద్రతాధికారులు, సెక్యూరిటీ గార్డుల వివరాలు కూడా ఆయన కోరారు. మొబైల్ ఫోన్లను పారేయవద్దని, అందులోని సంభాషణలను తొలగించడం కానీ లేదా మార్చడం కానీ చేయవద్దని జస్టిస్ వర్మకు సూచించాలని చెప్పారు.

త్రిసభ్య కమిటీ నియామకం

జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు పంజాబ్–హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జిఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌తో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సిజెఐ ఖన్నా ఓ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. అసలు స్టోర్‌రూములోకి ఆ నగదు ఎలా చేరింది, దానిని ఎవరు ఇచ్చారు, కాలిపోయిన నగదు కట్టలను గది నుండి ఎవరు తొలగించారు, ఈ ఉదంతం వెనుక ఏమైనా కుట్ర ఉన్నదా అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

పంజాబ్‌లో పోలీస్ జులుంకు వ్యతిరేకంగా
28 దేశవ్యాప్త నిరసనలు : ఎస్‌కెఎం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్‌లో పోలీసుల అణచివేత చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 28న దేశవ్యాప్త నిరసనలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం ఎస్‌కెఎం జాతీయ సమన్వయ కమిటీ ప్రకటన విడుదల చేసింది. ఆప్ నేతృత్వంలోని పంజాబ్ రాష్ట్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, కార్పొరేట్ అనుకూల కేంద్రప్రభుత్వం ముందు లొంగిపోయిందని విమర్శించింది. పోలీసు అణచివేతకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండాలని, నిరసన హక్కును కాపాడాలని అన్ని రైతు సంఘాలకు పిలుపునిచ్చింది. ఎన్‌పిఎఫ్‌ఎఎంకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన జరగనుందని తెలిపింది. సి2ప్లస్50 శాతంతో ఎంఎస్‌పి, రుణమాఫీ వంటి డిమాండ్లపైనా రైతాంగం ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది. భగవంత్‌సింగ్ మాన్ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు పంజాబ్ పోలీసులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్, శ్రవాన్ సింగ్ పాంధర్‌తో సహా 350 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారని విమర్శించింది. ఖానౌరి, శంభు సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతుల గుడారాలను, వేదికలను పోలీసులు కూల్చివేసి, ట్రాక్టర్లు, ట్రాలీలు, అన్నదాతల యంత్రాలను బలవంతంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. సి2ప్లస్50 శాతంతో ఎంఎస్‌పి, రుణమాఫీ వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం రైతు సంఘాలు పోరాడుతున్నాయని పేర్కొంది. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపింది. కనుక రైతులను అప్పుల నుండి విముక్తి చేయడంతో రైతుల పోరాటాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందని, కానీ ఒక్క రూపాయి కూడా రైతు రుణాన్ని మాఫీ చేయలేదని విమర్శించింది.

ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకం ఉపసంహరణ

న్యూఢిల్లీ : ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఉల్లిపాయలపై 20శాతం ఎగుమతి సుంకాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఎగుమతులను పెంచడం, ధరలను స్థిరీకరించడం లక్ష్యంగా సుంకాన్ని ఎత్తివేసినట్టు శనివారం రెవెన్యూ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని (2023 డిసెంబర్‌లో విధించిన) కేంద్రం గతేడాది మేలో రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ప్రజల ముందుకు పోప్ ఫ్రాన్సిస్

రోమ్ : ఆసుపత్రిలో చేరిన సుమారు ఆరు వారాల తరువాత పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం తొలిసారి ప్రజలకు బహిరంగంగా కనిపించారు. రోమ్‌లోని జెమెల్లి ఆసుపత్రి ప్రధాన ద్వారం బాల్కనీ వద్దకు ఆదివారం ఉదయం చక్రాల కుర్చీలో ఆయన వచ్చారు. 88 ఏళ్ల పోప్ తన కుడిచేతి వేలును పైకెత్తి ఆసుపత్రి ప్రధాన ద్వారం వెలుపల గుమిగూడి ఉన్న ప్రజా సమూహాన్ని అభినందించారు. ఆసుప్రతి నుంచి పోప్‌ను త్వరలో డిశ్చార్జ్ చేస్తామని శనివారం సాయత్రం ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు.

నితీష్‌కు ముస్లిం సంఘాల షాక్

పాట్నా : బీహార్ సిఎం నితీష్‌కుమార్‌కు ఏడు ప్రధాన ముస్లిం సంఘాలు షాక్ ఇచ్చాయి. ఆదివారం పాట్నాలోని 1 అన్నే మార్గ్‌లోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో నితీష్‌కుమార్ ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందును బహిష్కరించాయి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లుకు జెడి(యు) మద్దతు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు నితీష్‌కుమార్‌కు లేఖ రాశాయి. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇమారత్–ఎ–షరియా, జమియత్ ఉలామా–ఇ–హింద్, జమియత్ అహ్లే హదీస్, జమాల్–ఎ–ఇస్లామి హింద్, ఖాన్కా ముజిబియా, ఖాన్కా రెహ్మానీ ఈ లేఖ రాసాయి.

ఔరంగజేబుపై వ్యతిరేకత మతపరమైనది కాదు

- **ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే**

బెంగళూరు : మొఘల్ చక్రవర్తి ఔరంగజేబును వ్యతిరేకించడం మతపరమైనది కాదని, దేశం, దేశ ఐక్యత ప్రయోజనాల కోసమేనని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే అన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జరిగింది స్వాతంత్ర్యం పోరాటమైతే, బ్రిటిష్ వారికంటే ముందు మనదేశాన్ని పాలించిన వారికి వ్యతిరేకంగా జరిగింది కూడా స్వాతంత్ర్య పోరాటమేనని కొత్త భాష్యం చెప్పారు. బెంగళూరులో మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత నిర్ణయాధికారం కలిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఎబిపిఎస్) ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశ నైతికతకు విరుద్ధమైన ఔరంగజేబును ఒక మతానికి ప్రతిరూపంగా చూపించడం సరైనదేనా అని హోసబాలే ప్రశ్నించారు.

నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ ఎత్తివేత

మహారాష్ట్ర : నాగ్‌పూర్‌లోని అన్ని ప్రాంతాల్లో ఆరు రోజుల తర్వాత కర్ఫ్యూ ఎత్తివేశారు. సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. 17న జరిగిన హింసాకాండ తర్వాత, నాగ్‌పూర్‌లోని పలుప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నిర్వహించిన నిరసన సందర్భంగా మతపరమైన శాసనం ఉన్న 'చాదర్'ను దహనం చేశారని సోమవారం రాత్రి పుకార్లు వ్యాపించడంతో నాగ్‌పూర్ కేంద్రంలోని పలు ప్రాంతాలలో హింస చెలరేగింది.

ఆస్తి పన్ను పెంపు నిలిపివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నాటి నుండి నేటికి ఆస్తి పన్ను 100 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఇది ఇంకా పెరుగుతుందని వివరించారు. నిర్మాణంలో ఎలాంటి మార్పులు చేసినా, ఖాళీ స్థలాన్ని ఎవరికైనా అమ్మినా ఆనాటికున్న ఆస్తి కేపిటల్ విలువ (మార్కెట్ విలువ)పై పన్ను విధిస్తున్నారని పేర్కొన్నారు. ఇది భారంగా మారుతున్నదని తెలిపారు. భవన అనుమతులు లేవనే సాకుతో ఆ భవనాలపై మరింత అదనంగా పన్ను విధిస్తున్నారని వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉన్నందున ఇంటిపన్ను చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, తక్షణమే చెల్లించకపోతే మంచినీరు, డ్రెయినేజీ కనెక్షన్‌లు తొలగిస్తామని బెదిరిస్తున్నారని, కొన్నిచోట్ల ఇప్పటికే తొలగించారని వివరించారు. ఆర్థిక సంవత్సరం ముగియకుండానే పెనాల్టీతో వసూలు చేయడం సమంజం కాదని సూచించారు. కాబట్టి 24 శాతం పెనాల్టీలు రద్దు చేసి మే నెలాఖరు వరకు పెనాల్టీ లేకుండా పన్నులు ప్రజలు చెల్లించే అవకాశం కల్పించాలని, అందుకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రజలు భారాలు మోసే స్థితిలో లేరని పలుసార్లు ప్రకటించారని ముఖ్యమంత్రికి గుర్తుచేశారు. అదనపు భారాలు వేయబోమని మాట ఇచ్చారని, పై విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు భారంగా మారిన సవరణ చట్టం 44/2020, జిఒ 198ను రద్దు చేయాలని కోరారు. ఏప్రిల్ నుండి 15 శాతం ఆస్తిపన్ను పెంపుదల లేకుండా తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వులు ఇవ్వడంతోపాటుగా, సవరణ చట్టం 44/2020ను రద్దు చేస్తూ ఆర్డినెన్సు జారీ చేయాలని కోరారు.

అమెరికాలో కాల్పులు

- **భారత్‌కు చెందిన తండ్రీ కూతురు మృతి**



వర్జీనియా : అమెరికాలోని వర్జీనియాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో భారత్‌కు చెందిన తండ్రీ, కూతురు చనిపోయారు. వీరిని గుజరాత్‌కు చెందిన ప్రదీప్ పటేల్, ఉర్మిగా గుర్తించారు. ఈ క్రమంలో కాల్పులు జరిపిన నిందితుడు ఫ్రేజర్ దేవన్ వార్టన్ (44)ను అదుపులోకి తీసుకున్నట్టు వర్జీనియా పోలీసులు తెలిపారు. ప్రదీప్ పటేల్, ఆయన కూతురు ఉర్మి.. గురువారం వర్జీనియాలోని అకోమాక్ కౌంటీలో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌కి వెళ్లారు. వారు స్టోర్‌లో ఉన్న సమయంలో నిందితుడు ఫ్రేజర్ దేవన్ వార్టన్ అక్కడికి వెళ్లాడు. తనకు మందు కావాలని అడగడంతో స్టోర్ సిబ్బందికి, అతడికి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం, స్టోర్‌లో ఉన్న వర్కర్లపై నిందితుడు విచక్షణారహితంగా కాల్పలు జరిపాడు. ప్రదీప్ కుమార్ ఘటనా స్థలంలోనే మరణించగా, ఉర్మి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. అనంతరం, కాల్పులు జరిపిన ఫ్రేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'కౌలు' చట్టంపై యూటర్న్!

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చింది. ఎల్ఇసి, సిఒసి... ఏదైనా కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు, పథకాల విషయంలో నామమాత్రంగానే లబ్ధి చేకూరింది. సిసిఆర్‌సి వచ్చాక పరిస్థితి ఇంకా దిగజారింది.

లీగల్ సమస్యలు

కౌల్దార్లకు కొత్త చట్టంపై ప్రభుత్వం తొలుత కొంత కసరత్తు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని చెప్పి ఐదు సమావేశాలు నిర్వహించింది. అధికారులు, రైతు సంఘాలు, రైతు ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఆ కసరత్తు మధ్యలోనే నిలిచిపోయింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కౌలు రైతులను లెక్కలోనుంచి తీసేసింది. పిఎంకిసాన్, సహా ఏ ప్రభుత్వ పథకమూ వారికి ఇవ్వట్లేదు. ఆధార్ తరహాలో సొంత భూమి కలిగిన రైతులకు భూధార్‌కార్డును తప్పనిసరి చేసింది. పిఎంకిసాన్, బ్యాంక్ రుణాలు, అన్నింటికీ భూధారేనని ప్రకటించింది. భూధార్ జారీ ప్రక్రియ రాష్ట్రంలో ముమ్మరంగా జరుగుతోంది. అధికారికంగా భూమి యజమానికి భూధార్ ఇస్తే, కౌలు రైతుకు ఆ భూమిపై ఏ పథకమూ రాదు. బ్యాంకులు రుణాలివ్వవు. ఎపి సర్కారు తసుకొచ్చే చట్టం రూపకల్పనలో ఈ అంశాన్ని లీగల్‌గా పరిశీలిస్తున్నట్లు సమాచారం. భూమి వ్యవహారాలు రెవెన్యూశాఖ చూస్తుంది. గతంలో ఎల్ఇసి, సిసిఆర్‌సిలను రెవెన్యూ అధికారులే ఇచ్చారు. సిఒసిలను వ్యవసాయశాఖ ఇచ్చినా బ్యాంకులు వాటిని పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. కొత్తగా తీసుకొచ్చే చట్టంలో వ్యవసాయాధికారులు కౌలు రైతులను గుర్తిస్తారన్నారు. ఈ మార్పు వలన కొత్త చిక్కులొస్తాయన్న సూచనలు అధికారుల నుంచి వచ్చాయని తెలిసింది.

స్కీంలకు దూరం

రైతులకు ఏటా రూ.20 వేల నగదు సాయం అందించే కూటమి సర్కారు సూపర్ సిక్స్ పథకం అన్నదాతా సుఖీభవను కౌలు రైతులకూ వర్తింపజేస్తామన్నారు. సొంత భూమి కలిగిన రైతులకు పిఎంకిసాన్‌తో కలిపి అమలు చేస్తున్నందున కేంద్రం నుంచి ఆరు వేలు వస్తే తతిమ్మా 14 వేలూ రాష్ట్రం ఇస్తుంది. కౌలు రైతులకు కేంద్రం పైసా ఇవ్వదు కనుక రాష్ట్రమే మొత్తం 20 వేలూ ఇస్తానంది. సిసిఆర్‌సిలను అర్హతగా పెడితే లక్షల మంది కౌలు రైతులకు సహాయం దక్కదు. కొత్త చట్టం తెచ్చి ఉదారంగా గుర్తిస్తేనే వీలైనంత ఎక్కువ మందికి సాయం అందుతుంది. త్వరలో అన్నదాతా.. అమలు చేస్తామంటున్నారు. అదే జరిగితే కౌలు రైతులకు గతంలో 'భరోసా'కు మల్లే నష్టం జరుగుతుంది. బ్యాంక్ పరపతి, పంటల బీమా, సున్నా వడ్డీ, సీడ్ సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎంఎస్‌పి, అన్ని పథకాలూ నష్టపోవాల్సిందే.

కనుమరుగవుతున్న 'చరిత్ర'

(మొదటిపేజీ తరువాయి)


చేతులు దులుపుకుంటోంది.

సిహెచ్ఇసి తీసుకురావాలని వినతులు

ఇంటర్మీడియట్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మేథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంబైపిసి) కోర్సులానే ఆర్ట్సులోనూ కామర్స్, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ (సిహెచ్ఇసి) తీసుకురావాలనే విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇంటర్ విద్యలో హెచ్ఇసికి ఆదరణ తక్కువగా ఉంది. దీంతో ఈ రెండు కోర్సులను కలిపి సిహెచ్ఇసి కోర్సు ప్రవేశపెడితే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ విధానం వల్ల ప్రభుత్వానికి అదనంగా భారం కూడా ఉండదని అంటున్నారు. ఈ రెండు గ్రూపులను విలీనం చేయాలని ఇప్పటికే కొంతమంది తల్లిదండ్రులు, విద్యావేత్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎన్నికల సంఘం ఓ 'విఫల సంస్థ' : కపిల్ సిబాల్

న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం ఓ అసమర్థమైన, విఫలమైన సంస్థగా మారిపోయిందని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ వ్యాఖ్యానించారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "ఎన్నికల సంఘం తన రాజ్యాంగ బాధ్యతలను సరిగా నిర్వహించడంలో విఫలమైంది. దీనిపై ప్రజల నమ్మకం తగ్గడం వల్ల ప్రజాస్వామ్యం అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యను వేగంగా పరిష్కరించాలి," అని అన్నారు. ఓటరు జాబితాలో పలు అక్రమాలు, అకస్మాత్తుగా పేర్ల తొలగింపు, నకిలీ ఓటరు ఐడిలు తదితర అంశాలపై కాంగ్రెస్, టిఎంసి తదితర పార్టీలు ఎన్నికల సమయంలో పలు ఆరోపణలు చేశాయి. ఎన్నికల ప్రక్రియ కలుషితమైందని, ఇవిఎంలతో పాటు ఇతర సమస్యలు కూడా ఉన్నాయని కపిల్ సిబాల్ వివరించారు. "ఎన్నికల ఫలితాలు అనేక స్థాయిలలో మార్పు చేసి ఉండవచ్చు. ఈ సమస్యను మనం కలిసి పరిష్కరించాలి," అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ ఆరోపణలకు ప్రతిస్పందనగా, ఎన్నికల సంఘం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ)తో సాంకేతిక సంప్రదింపులు జరపనున్నట్లు తెలిపింది. ఓటర్ ఐడీలను ఆధార్తో లింక్ చేయడం ద్వారా ఓటర్ల జాబితాలను సరిచేయాలని, దేశంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీలతో సమావేశాలు జరిపి, సమస్యలను పరిష్కరించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల సంఘంపై ప్రజల నమ్మకం పునరుద్ధరించడానికి, పారదర్శకత, స్వతంత్రతను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని కపిల్ సిబాల్ డిమాండ్ చేశారు. "ఎన్నికల ప్రక్రియ కలుషితమైతే, ప్రజాస్వామ్యం అంతరించిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి, ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలి," అని ఆయన పేర్కొన్నారు.



'ఇండియా' పార్టీలకు సమన్వయ విధానం అవసరం

ఇండియా వేదికలో పార్టీలకు సమన్వయ విధానం, సైద్ధాంతిక చట్రం, భవిష్యత్తు కోసం ఒక కార్యక్రమం అవసరమని కపిల్ సిబాల్ పేర్కొన్నారు. ఇండియా బ్లాక్ ఒక కూటమిగా కనిపించాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉన్నట్లు పార్టీలన్నీ విడివిడిగా ఉండకూడదని అన్నారు. రాష్ట్రస్థాయి లేదా జాతీయ స్థాయితో సంబంధం లేకుండా జాతీయంగా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై పార్టీల ఆలోచనా విధానంలో సమన్వయం ఉండాలని, అందుకు తగిన యంత్రాంగాన్ని నిర్మించుకోవాలని అన్నారు. ఇండియా బ్లాక్ అభిప్రాయాన్ని వెల్లడించే తగిన ప్రతినిధి లేకపోతే ప్రభావవంతంగా ముందుకు సాగుతుందని తాను భావించడం లేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు భవిష్యత్తు ఉందని తాను భావిస్తున్నానని, అది ఏ రూపం తీసుకుంటుందో, ఏ నిర్మాణక్రమంలోకి మారుతుందో చూడాలని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడంపై సైతం స్పందించారు. బిజెపికి మెజారిటీ లేనందున ఎన్‌డిఎ కూటమిలోని భాగస్వామ్య పార్టీల వైఖరి చూడాలని అన్నారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, దీంతో వక్ఫ్ బిల్లు ప్రభావం ఆ ఎన్నికలపై ఎలా ఉంటుందోనని బిజెపి ఆందోళన చెందుతోందని చెప్పారు.




మీకోసం

పాలు కాచే గిన్నెలో కాసేపు నీళ్లు పోసి ఉంచాలి. తరువాత ఆ నీళ్లను పారబోసి ఆ గిన్నెలో పాలు కాస్తే, అడుగున పేరుకుపోకుండా ఉండి గిన్నెను సులభంగా శుభ్రం చేసుకోవచ్చు.

జీవన సౌరభం

లక్ష్యం అవకాశం కాదు.. ఎదురు చూడాల్సింది కాదు.. ఎన్నుకోవాల్సింది.

తగిన శాస్తి



దొంగల ధర్మారం అడవిలో ఒక వేటగాడు నెమలిని వేటాడి తీసుకెళ్తుండగా అది ఎంతో ప్రాధేయపడింది. వదిలేయమని బతిమాలింది. దాని మాటలు వేటగాడు పెడచెవిన పెట్టాడు. ఈలోపు ఆ దారిలో పోలీసులు వచ్చారు. వేటగాడు పోలీసులకు దొరికాడు. జైలు పాలయ్యాడు. అటవీ అధికారులు ఆ నెమలిని అడవిలో వదిలి పెట్టారు. జైలు నుంచి విడుదల అయినా వేటగాడు తన పాత బుద్ధి మానలేదు. మళ్లీ వేట ప్రారంభించాడు.

ఈసారి అడవిలో అతనికి ఒక ఏనుగు కనిపించింది. దాన్ని ఎలాగైనా పట్టుకుని సర్కస్ వాళ్లకి అప్పజెబితే బాగా డబ్బులు వస్తాయని ఆశపడ్డాడు. ఏనుగు కోసం వల పన్నుతుండగా ప్రమాదం గ్రహించిన ఏనుగు వేటగాడిని తన తొండంతో పట్టుకుంది. గట్టిగా ఘీంకరిస్తూ 'ఒరేయ్ వేటగాడా! అడవిలో పక్షులు, జంతువులు లేకుండా చేస్తున్నావు. ఈ అడవి మాది. ఇక్కడ మేం స్వేచ్ఛగా తిరుగుతాం. నువ్వు మా స్వేచ్ఛని పాడు చేస్తున్నావు' అని అంటుండగా మిగిలిన జంతువులన్నీ అక్కడికి వచ్చాయి.

వేటగాడిని ఏనుగు తొండంతో పట్టుకోవడం చూసి అవి చాలా సంతోషపడ్డాయి. 'అతనిని ప్రాణాలతో ఉంచొద్దు. చంపేయ్. మమ్మల్ని ఎంతో బాధించాడు. మా స్నేహితులని, కుటుంబ సభ్యులని వేటాడాడు' అని ముక్తకంఠంతో పలికాయి. అయితే 'ఏనుగు కొంచెం నెమ్మదించి, స్నేహితులారా వేటగాడ్ని చంపడం మన పని కాదు. అతనికి బుద్ధి వచ్చేలా చేద్దాం' అని చెప్పి వేటగాడితో 'ఓయ్, ఇప్పుడు నిన్ను వదిలి పెడుతున్నా, ఈసారి నువ్వు మా జంతువులని వేటాడితే చంపడం ఒక్కటే మా పని గుర్తుంచుకో' అని అక్కడి నుండి పంపించేసింది. బతుకుజీవుడా అనుకుంటూ వేటగాడు ఇంటికి చేరాడు. ఆ రోజు నుండి అడవిలో జంతువులను వేటాడడం ఆపేశాడు. అతనే కాదు. ఇంకెవ్వరూ అడవిలో జంతువులను వేటాడకుండా జాగ్రత్త పడ్డాడు. వేటగాడిలో వచ్చిన మార్పుకు జంతువులు ఎంతో సంతోషపడ్డాయి.




– బొగోళ్ళ అక్షిత్,
7వ, తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
బక్రిచెప్యాల,
సిద్దిపేట.

నేను గీసిన బొమ్మ



ఎం. చరణ్,
7వ తరగతి,
ఎస్‌కెవిటి గవర్నమెంట్ హైస్కూల్,
రాజమహేంద్రవరం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సమర్ధవంతమైన చికిత్సతో అదుపు చేద్దాం

ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకాన్ని భయపెడుతున్న వ్యాధుల్లో ట్యూబర్ క్యులోసిస్ (క్షయవ్యాధి-టిబి) ఒకటి. ఇది కూడా ప్రాణాంతక వ్యాధే. సమర్ధవంతమైన చికిత్స, నివారణ, ప్రజలకు అవగాహనతో ఈ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించొచ్చు. మనదేశంలో 2030 నాటికి టిబిని నిర్మూలించేందుకు ఎన్‌టిఇపి ప్రోగ్రాం ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది. దీనికోసం బిసిజి వ్యాక్సినేషన్, ఎండిఆర్-టిబి చికిత్స, ఎన్‌పివై వంటి అనేక చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలు తీసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది థీమ్‌గా 'అవును! మనం టిబిని ముగించగలం (ప్రతిజ్ఞ(కమిట్), పెట్టుబడి (ఇన్వెస్ట్), కృషిచేయి (డెలివర్) అనే పేరుతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ), ఇతర అంతర్జాతీయ సంస్థలు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

నేడు ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం



టిబి ఒక సంక్రమణా జబ్బు. ఇది ప్రధానంగా శ్వాసనాళాల ద్వారా వ్యాపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అనేకమందిని ప్రభావితం చేస్తోంది. మనదేశంలో టిబి ఒక గంభీరమైన ఆరోగ్య సమస్యగా కొన సాగుతోంది. ఏటేటా లక్షల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా ఈ సంఖ్య చాలా ఎక్కువగానే ఉంది. ట్యూబర్క్యులోసిస్ (టిబి) నివారణ కోసం రాష్ట్రప్రభుత్వం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రారంభ లక్షణాలను గుర్తించి, సమయానికి నిర్ధారణ చేసి, సక్రమంగా చికిత్స చేయటం చాలా ముఖ్యం. గుర్తించిన తొలిదశలోనే చికిత్స ప్రారంభించటం ద్వారా రోగం తీవ్రత నుంచి బయటపడొచ్చు. ఇతరులకు కూడా వ్యాప్తి చెందకుండా నియంత్రించొచ్చు. నివారణలో క్లీన్‌లివింగ్ ప్రాక్టీసెస్ చాలా ముఖ్యం. దగ్గు లేదా తుమ్ము సమయంలో ముసుగుతో లేదా చేతిలో రుమాలుతో మూసుకోవటం ద్వారా వ్యాధి విస్తరణను నివారించొచ్చు. బిసిజి (బాసిల్స్ ఆఫ్ కాల్మెట్-గ్యరిన్) టీకాలు చిన్నపిల్లల్లో టిబి వ్యాధి ప్రభావాన్ని తగ్గిస్తుంది. వయోజనుల బిసిజి టీకా కార్యక్రమం ద్వారా ముందస్తుగా టీబీ వ్యాధి రాకుండా రాష్ట్రంలో ఎంపిక చేసిన 12 జిల్లాల్లో ఇప్పటివరకూ 18 సంవత్సరాలు నిండివారిలో 27.71 లక్షల మందికి అందించాం. రోగలకు సరైన ఆహారం, మెరుగైన వైద్యం, మంచి పోషణ, సరైన నిద్ర, వ్యాయామం, రోగ నిరోధక శక్తిని పెంపొం దించుకోవటం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం.

నిర్ధారణా పరీక్షలు, చికిత్స

టిబి నివారణా చికిత్స (టిపిటి) అనేది ఒక ముఖ్యమైన విధానం. ఇది వ్యాధి సోకకుండా ఉండటానికి, రిస్క్ ఉన్న వ్యక్తులకు మందులు అందించటం ద్వారా వ్యాధి వ్యాప్తిని నివారిస్తుంది. ట్యూబరుక్యులోసిస్ (టిబి) నిర్ధారణలో క్లినికల్ పరీక్ష, ఛాతీ ఎక్స్‌రే, జీవజాల పరీక్షలు, మాలిక్యులర్ పద్ధతులు ఉపయోగిస్తారు. రాష్ట్రంలో 749 ట్రూనాట్, 50 సిబిఎన్ఎఎటి కేంద్రాలు అధునాతన సౌకర్యాలతో అందుబాటులో ఉన్నాయి. నాలుగు సిడిఎస్‌టి ల్యాబులు ఉండగా తిరుపతిలో మరో ల్యాబ్ సిద్ధమవుతోంది. ఇవి వ్యాధి నిర్ధారణలో చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి.

డ్రగ్ సెన్సిటివ్ ట్యూబర్క్యులోసిస్ (టిబి) : ఈ రోగులకు సాధారణంగా ఆరునెలల చికిత్సలు ఉంటాయి. ఇది సరైన సమయంలో, పద్ధతిలో తీసుకుంటే పూర్తిగా నయమవుతుంది.

వ్యాధి లక్షణాలు

- రెండు వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు
- సాయంత్రం పూట జ్వరం
- ఆకలి, బరువు తగ్గటం
- ఉమ్మి (గళ్ల)లో రక్తం పడటం
- ఛాతీలో నొప్పి రావటం

ప్రభుత్వం కృషి ఇలా..

- అవగాహన పెంపొందించటం
- లక్షణాలున్న వ్యక్తుల గుర్తింపు
- చికిత్సలుపై పర్యవేక్షణ
- ఆరోగ్య క్యాంపుల ఏర్పాటు
- గ్రామస్థాయిలో సమాచారం అందించటం

డ్రగ్ రెసిస్టెంట్ ట్యూబర్క్యులోసిస్ (డిఆర్‌బిటి) : ఈ రోగులకు 9 నుంచి 18 నెలల వరకూ చికిత్సలు అవసరం. ఈ రకం టిబిలో బ్యాక్టీరియా నిరోధకత (రెసిస్టెన్స్) కలిగిన కారణంగా, పలు శక్తివంతమైన, ప్రత్యేకమైన మందులు అవసరమవుతాయి. డిఆర్‌బిటి చికిత్సలో సరైన మందులు, సకాలంలో అందిస్తే రోగం పూర్తిగా నయమవుతుంది. ఇంట్లోనే ఈ చికిత్సలు అందించబడతాయి. సాధారణంగా ఆరోగ్య కేంద్రాల నుంచి లేదా హెల్త్ వర్కర్ల ద్వారా నిర్వహించబడుతుంది. ఇంట్లోనే మానిటరింగ్ చేయటం ద్వారా సమీపంలోని వారికి వ్యాపించ కుండా ఉంటుంది. రోగికి కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టిబి నిర్ధారణ, చికిత్సలు, నివారణా పద్ధతులు సమర్ధవంతంగా అమలు జరుగుతున్నాయి.

వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

రాష్ట్రంలో పిఎంటిబిఎంబిఎ ప్రోగ్రాంలో భాగంగా 2023-24లో క్షయవ్యాధిగ్రస్తులకు అదనంగా పౌష్టికాహారం అందించటం కోసం నిక్షయ్ మిత్రలను గుర్తించి వారి ద్వారా సుమారు 2 లక్షలకుపైగా న్యూట్రీషన్ ఫుడ్ బాస్కెట్లను అందించాం. డిబిటి ద్వారా వ్యాధిగ్రస్తులకు చికిత్సా కాలంలో పోషకాహారం నిమిత్తం నెలకు రూ.500 చొప్పున 2024 నవంబర్ నెల వరకూ ఇచ్చాం. ప్రస్తుతం రూ.1000 చొప్పున ఇస్తున్నాం. 2024లో 47,171 మంది బాధితులకు రూ.22.44 కోట్లను ఎన్‌పివై ద్వారా పోషకాహారం నిమిత్తం అందజేశాం. పిఎం టివి ముక్త్ పంచాయతీ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని పంచాయతీల్లో అవగాహనా కార్యక్రమాలు జరిగాయి. 2023లో 744 పంచాయతీలు టిబి ముక్తంగానూ, 2024లో 867 పంచాయతీలను టిబి రహితంగానూ ప్రకటించబడ్డాయి.

నియంత్రణే లక్ష్యంగా ఎన్‌టిఇపి కార్యక్రమాలు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ టిబి నియంత్రణ కోసం నేషనల్ టివి ఎలిమినేషన్ ప్రోగ్రాం (ఎన్‌టిఇపి) అమలవుతోంది. ముఖ్యంగా గుర్తించటం, సమర్ధవంతమైన చికిత్సలు అందింటం, టిబి లేని దేశంగా లక్ష్యాన్ని సాధించటానికి పనిచేస్తున్నాం. ఈ చర్యల్లో భాగంగా నిరోధక చర్యలు, పుష్కలంగా మందులు పంపిణీచేయటం, మద్దతుగా సేవలు, అవగాహనా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం.

ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు

టిబి కేసుల వివరాలు ఇవీ...

సంవత్సరం	అనుమానిత కేసులు	గుర్తించినవి	సక్సెస్‌రేటు
2022	4,36,313	92,182	93
2023	11,25,608	88,537	96
2024	15,94,128	83,759	95
2025	3,16,855	13,536	95

ఇప్పటివరకూ సాగిన కృషి ఇలా...

1882లో రాబటర్ట్ కోచ్ టిబి కారక మూలకాన్ని గుర్తించారు. అప్పటి నుంచి క్షయ వైద్యశాలలు, క్లీనిక్స్, జిల్లా క్షయ నివారణ కేంద్రాలు స్థాపించటం ద్వారా 1962లో జాతీయ క్షయ నిరోధక కార్యక్రమం అమలు జరిగింది. అనుకున్నంత సత్ఫలితాలు రాకపోవటంతో 1998లో దశలవారీగా జాతీయ క్షయ నిరోధక కార్యక్రమాల ద్వారా అవగాహన పెరిగి, ప్రపంచవ్యాప్తంగా ఫలితాలు రావటం ప్రారంభమైంది. అప్పటి నుంచి పెద్దఎత్తున ఏటేటా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 2030 నాటికి టిబి రహిత భారతదేశంగా తీర్చిదిద్దటానికి అందరం కృషిచేద్దాం.ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా క్షయ వ్యాధి నివారణా శిబాగం ద్వారా సోమవారంనాడు అవగాహనా సదస్సులు, ర్యాలీలు జరుగుతాయి. ఉచితంగా మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు కూడా ఉంటాయి.



– డాక్టర్ టి.రమేష్,
రాష్ట్ర ఆరోగ్య,
కుటుంబ సంక్షేమశాఖ,
జాయింట్ డైరెక్టర్,
రాష్ట్ర క్షయ నివారణా అధికారి,
మంగళగిరి,
సెల్ : 98499 09911.

వడగండ్ల వర్షం..అపార నష్టం

- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో దెబ్బతిన్న ఉద్యానపంటలు
- నష్టాన్ని భరించలేక ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం
- సిఎం చంద్రబాబు ఆరా



పులివెందులలో నేలకొరిగిన అరటితోట

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాయలసీమలోని కడప, అనంతపురం, సత్యసాయి జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కురిసిన అకాల వర్షాల వల్ల ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లా, యల్లనూరు మండలం, నీర్జంపల్లిలో పంట నష్టాన్ని జీర్ణించుకోలేక ఇద్దరు అరటి రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్ప ఆదివారం ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డారు. వడగళ్ల వాన కారణంగా కడప, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం జిల్లాల్లో 10 మండలాల్లోని 40 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లింది. మొత్తం 1,364 మంది రైతులకు చెందిన 1,670 హెక్టార్లలో హార్టికల్చర్ పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. అకాల వర్షాలు, వడగళ్ల వాన వల్ల జరిగిన పంట నష్టం వివరాలను క్షేత్రస్థాయి పర్యటన ద్వారా పరిశీలించినట్లు తెలి పారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా అకాల వర్షాలు, వడగండ్ల వానతో తీవ్ర నష్టం వాటిల్లింది.

ఆందోళన వద్దు : చంద్రబాబు

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఆందోళన పడొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యాన రైతులకు భరోసా ఇచ్చారు. అనంతపురంలో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఆయన ఆరా తీశారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతుల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని, ప్రాణాపాయం తప్పిందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. మెరుగైన వైద్యం కోసం రైతులను అనంతపురానికి తరలిస్తున్నట్లు తెలిపారు.

అచ్చెన్న టెలికాన్ఫరెన్స్

రాయలసీమలో వడగళ్ల వర్షం..అపార నష్టంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నా యుడు ఉద్యానవన శాఖ అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వడగళ్ల వాన కారణంగా ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనాలు వేయాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు.. రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

ఒడిశా అధికారుల దుందుడుకుతనం

- వివాదాస్పద కొటియా గ్రామాల్లో మైనింగ్ తవ్వకాలకు చర్యలు
- గిరిజనులు వ్యతిరేకించినా పోలీసులతో దౌర్జన్యం
- చోద్యం చూస్తోన్న మన రాష్ట్ర ప్రభుత్వం



ఎగువ శెంబిలోని గిరిజనుల సాగు భూముల్లో మైనింగ్ తవ్వకాల కోసం ఒడిశా అధికారులు పాతిన స్తంభాలు

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

కొటియా గ్రామాల విషయంలో ఒడిశా ప్రభుత్వం మళ్లీ కయ్యానికి కాలు దువ్వుతున్న పరిస్థితి కనిపిస్తోంది. వివాదాస్పద సరిహద్దు గ్రామాల్లో దూకుడు పెంచింది. కొటియా గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణం చేపడుతోంది. అయితే, ఈ ప్రాంతాల్లో మన రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను అడ్డుకుంటోంది. తాజాగా ఎగువ శెంబిలోని గిరిజనుల సాగు భూముల్లో మైనింగ్ తవ్వకాలకు ఒడిశా అధికారులు స్తంభాలు పాతారు. గతంలో గంజాయిభద్రలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ధ్వంసం చేయడం, మన రాష్ట్ర వైద్య సిబ్బందిని కొటియా గ్రామాల్లోకి రానీయకుండా అడ్డుకోవడం, విద్యుత్ మీటర్ల బిగింపు చర్యలను ఆటంకపర్చడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఇటీవల దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సిమెంట్‌తో సహా ఇతర నిర్మాణ సామగ్రిని, దిగువ శెంబిలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి పుస్తకాలను, ఆట వస్తువులను కొటియా పోలీసులు, అధికారులు దౌర్జన్యంగా తీసుకుని వెళ్లిపోయారు. ఒడిశా దూకుడుగా వెళ్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వం అనుసరించిన వైఖరినే నేటి టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అనుసరిస్తుండడంతో గిరిజనుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువ శెంబి సమీపాన ఉన్న కొండపై మైనింగ్ తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొండ చుట్టూ గిరిజనుల సాగులో ఉన్న భూముల్లో మైనింగ్ తవ్వకాలకు సిద్ధమవుతోంది. ఈ గ్రామానికి చెందిన తాడంగి సనుము, తాడంగి రాజు అనే గిరిజన రైతుల భూముల్లో సరిహద్దు రాళ్లు పాతింది. దీన్ని గ్రామానికి చెందిన గిరిజనులు వ్యతిరేకించినా పోలీసులతో దౌర్జన్యంగా భూముల్లో మార్కింగ్ చేశారు. ఈ భూములవైపు రావద్దని గిరిజనులను ఒడిశా పోలీసులు, అధికారులు హెచ్చరిస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న కొండలో విలువైన ఖనిజం ఉన్నట్లు ఒడిశా ప్రభుత్వం చాలా సంవత్సరాల క్రితం నిర్ధారించింది. ఈ కొండ పక్కన ఉన్న భూములను సాగు చేస్తున్న రైతులకు మన ప్రభుత్వం గతంలో పట్టాలు ఇవ్వడంతో ఒడిశా ప్రభుత్వం ఇంతవరకు ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాల పనులు చేపట్టలేక పోయింది.

టిడిపి కూటమి ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు

మన రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటింది. గడిచిన పది నెలల్లో ఒడిశా ప్రభుత్వం కొటియా గ్రామాల్లో అనేక దుందుడుకు చర్యలకు పాల్పడినా మన ప్రభుత్వం నుంచిగానీ, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచిగానీ ఏ విధమైన స్పందనా లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా దురాగతాలను అప్పటి మంత్రి రాజన్నదొర ఖండించడమో, తప్పు పట్టడమో చేశారు. ప్రస్తుత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి... కొటియా గ్రామాల విషయంలో నోరు మెదపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉంది. మన రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చింది. ఇలాంటి అనుకూల పరిస్థితుల్లో కొటియా గ్రామాల వివాదాన్ని పరిష్కరించే దిశగా అడుగులు పడతాయనే స్థానిక ప్రజలు భావించారు. కానీ, ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు.

ఉప్పల్‌లో పరుగుల వరద

- అజేయ సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్
- దంచికొట్టిన ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్
- రాజస్థాన్ రాయల్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ సూపర్ విక్టరీ



హైదరాబాద్ : ఉప్పల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో గెలుపొందింది. సన్‌రైజర్స్ బ్యాటర్లు ఇషాన్ కిషన్ (106 నాటౌట్, 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో, ట్రావిశ్ హెడ్ (67, 31 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో విశ్వరూపం చూపించారు. నితీశ్ కుమార్ రెడ్డి (30, 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (34, 14 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టారు. రికార్డు స్కోరు ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 242 పరుగులే చేసింది. ధ్రువ్ జురెల్ (70, 35 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), సంజు శాంసన్ (66, 37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో మెరువగా.. హెట్‌మయర్ (42, 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), శుభమ్ దూబె (34 నాటౌట్, 11 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) ధనాధన్ షో చేశారు. సెంచరీ హీరో ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

పవర్‌ఫుల్ షో : ఓపెనర్లు అభిషేక్ శర్మ (24, 11 బంతుల్లో 5 ఫోర్లు), ట్రావిశ్ హెడ్ (67) సీజన్ తొలి మ్యాచ్‌లోనే తమదైన బాదుడు చూపించారు. ట్రావిషేక్ జోడీ19 బంతుల్లోనే 45 పరుగులు పిండుకుంది. పేసర్ ఫరూకీపై విరుచుకుపడిన అభిషేక్ ఐదు బౌండరీలతో దండెత్తాడు. స్పిన్నర్ తీక్షణ మాయకు అభిషేక్ నిష్క్రమించినా.. పవర్ షో ఆగలేదు. ఇషాన్ కిషన్ (106 నాటౌట్)తో కలిసి హెడ్ ఊచకోత కొనసాగించాడు. తీక్షణపై నాలుగు ఫోర్లు బాదిన హెడ్.. ఏ బౌలర్‌ను వదిలిపెట్టలేదు. ఆరు సిక్సర్లు కొట్టిన హెడ్.. కౌవ్ కార్నర్, లాంగ్ ఆన్, బ్యాక్‌వర్డ్ పాయింట్ సహా ఆరు భిన్న కోణాల్లో బంతిని ఫెన్సింగ్ దాటించాడు. 23 బంతుల్లోనే 50 పరుగులు చేసిన హైదరాబాద్... 42 బంతుల్లో 100 మార్క్ చేరింది. ట్రావిశ్ హెడ్ ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 21 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. దీంతో పవర్‌ప్లేలో (6 ఓవర్లు) సన్‌రైజర్స్ 94/1 పరుగులు చేసింది. ఐపిఎల్ చరిత్రలో ఇది ఐదో అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరు.

14 పరుగుల దూరంలో..! : గత సీజన్ తరహాలోనే తొలి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ దూకుడుగా మొదలెట్టింది. ఐపిఎల్‌లో అత్యధిక స్కోరు రికార్డులు నిలకడగా బద్దలుకొడుతూనే ఉంది. 20 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగులు చేసి.. 300 మార్క్‌కు 14 పరుగుల దూరంలో నిలిచిపోయింది.

రాయల్స్ పోరాడినా.. : రికార్డు 287 పరుగుల ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ పోరాడినా ఫలితం దక్కలేదు.సన్‌రైజర్స్ పేసర్ సిమర్‌జిత్ సింగ్ ఆరంభంలోనే రెండు వికెట్లు పడగొట్టాడు. యశస్వి జైస్వాల్ (1), రియాన్ పరాగ్ (4)లను సాగనంపాడు. నితీశ్ రానా (11)ను మహ్మద్ షమి డకౌట్‌కు చేర్చాడు. పవర్‌ప్లేలో మూడు వికెట్లు కోల్పోయిన రాయల్స్ ఛేదనలో గాడి వదిలేసినట్టే కనిపించింది. కానీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సంజు శాంసన్ (66) ఉప్పల్‌లో రికార్డు కొనసాగించాడు. 37 బంతుల్లోనే 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 66 పరుగులు పిండుకున్నాడు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (70)తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించాడు. 60 బంతుల్లోనే ఈ జోడీ 111 పరుగులు సాధించింది. కానీ సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగటంతో బ్యాటర్లపై ఒత్తిడి పడింది. ఆఖర్లో షిమ్రోన్ హెట్‌మయర్ (42), శుభమ్ దూబె (34 నాటౌట్) ధనాధన్ దంచికొట్టారు. 34 బంతుల్లోనే 80 పరుగులు కొట్టారు. రాయల్స్ ఓటమి వ్యత్యాసం తగ్గించగలిగారు. 20 ఓవర్లలో 6 వికెట్లకు రాయల్స్ 242 పరుగులు చేసింది. 44 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్షల్ పటేల్ (2/34), సిమర్‌జిత్ సింగ్ (2/46), జంపా (1/48), షమి (1/33) రాణించారు.

స్కోరు వివరాలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ : అభిషేక్ శర్మ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 24, ట్రావిశ్ హెడ్ (సి) హెట్‌మయర్ (బి) దేశ్‌పాండే 67, ఇషాన్ కిషన్ నాటౌట్ 106, నితీశ్ కుమార్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30, హెన్రిచ్ క్లాసెన్ (సి) పరాగ్ (బి) సందీప్ 34, అనికెత్ వర్మ (సి) ఆర్చర్ (బి) దేశ్‌పాండే 7, అభినవ్ మనోహర్ (సి) పరాగ్ (బి) దేశ్‌పాండే 0, **పాట్ కమిన్స్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు :** 18, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 286.

వికెట్ల పతనం : 1-45, 2-130, 3-202, 4-258, 5-279, 6-279.

బౌలింగ్ : ఫరూకీ 3-0-49-0, మహీశ్ తీక్షణ 4-0-52-2, జోఫ్రా ఆర్చర్ 4-0-76-0, సందీప్ శర్మ 4-0-51-1, నితీశ్ రానా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 4-0-44-3.

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) మనోహర్ (బి) సిమర్‌జిత్ సింగ్ 1, సంజు శాంసన్ (సి) క్లాసెన్ (బి) హర్షల్ 66, రియాన్ పరాగ్ (సి) కమిన్స్ (బి) సిమర్‌జిత్ సింగ్ 4, నితీశ్ రానా (సి) కమిన్స్ (బి) షమి 11, జురెల్ (సి) ఇషాన్ (బి) జంపా 70, షిమ్రోన్ హెట్‌మయర్ (సి) మనోహర్ (బి) హర్షల్ 42, శుభమ్ దూబె నాటౌట్ 34, జోఫ్రా ఆర్చర్ నాటౌట్ 1, **ఎక్స్‌ట్రాలు :** 13, **మొత్తం :** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 242.

వికెట్ల పతనం : 1-20, 2-24, 3-50, 4-161, 5-161, 6-241.

చెన్నై బోణి

ఓటమి ఆనవాయితీని కొనసాగించిన ముంబయి ఇండియన్స్

చెన్నై : ఐపిఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ శుభారంభం చేసింది. సొంతగడ్డపై ఆదివారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై నాలుగు వికెట్లతో ఘన విజయం సాధించింది. ముంబయి విధించిన 156 పరుగుల లక్ష్యాన్ని ఇంకా ఐదు బంతులు మిగిలిఉండగానే ఆరు వికెట్ల మిగిలిఉండగానే చెన్నై ఛేదించింది. లక్ష్యసాధనకు దిగిన చెన్నై జట్టులో ఓపెనర్ రచిన్ రవీంద్ర అర్ధసెంచరీతో (65, 45 బంతుల్లో నాలుగు సిక్స్‌లు, రెండు ఫోర్లు)తో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 19 ఓవర్లు ముగిసే సమయానికి విజయానికి నాలుగు పరుగులు అవసరమైన స్థితిలో 20 ఓవర్ తొలి బంతిని రవీంద్ర సిక్స్‌గా మలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. మరో ఓపెనర్ రాహుల్ త్రిపాటి (2) నిరాశపర్చినా ఫస్ట్ డౌన్‌లో వచ్చిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ముంబయి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 26 బంతుల్లోనే మూడు సిక్స్‌లు, ఆరు ఫోర్లతో వేగంగా 53 పరుగులు చేసి, మూడో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ తరువాత వరసగా వికెట్లు పడతున్నా రవీంద్ర జోరుగా ఆడి మ్యాచ్‌ను ముగించాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లు నూర్ అహ్మద్ (4/18), పేసర్ ఖలీల్ అహ్మద్ (3/29) వికెట్లలో మెరిశారు. కాగా, ఇప్పటి వరకూ ఐపిఎల్‌లో ముంబయి ఇండియన్స్ ఓటమితోనే టోర్నీను ప్రారంభిస్తుంది. ఈ సీజన్‌లో అదే కొనసాగించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68